మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 2-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 || సంచిక: 242 Issue: 242

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:37 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి చతుర్దశి సా. 5:59 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఆశ్లేష ఉ. 7:48 వరకు తరువాత మఖ యోగం అతిగండ మ. 12:19 వరకు కరణం వనిజ సా. 5:59 వరకు విష్టి తె. 5:29ం వరకు వర్జ్యం రా. 7:41 నుండి రా. 9:16 వరకు దుర్ముహూర్తం మ. 12:51 నుండి మ. 1:38 వరకు మ. 3:11 నుండి మ. 3:58 వరకు రాహుకాలం ఉ. 8:05 నుండి ఉ. 9:32 వరకు యమగండం ఉ. 11:00 నుండి మ. 12:28 వరకు గుళికాకాలం మ. 1:56 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:01 నుండి తె. 5:49 వరకు అమృత ఘడియలు ఉ. 6:17 నుండి ఉ. 7:50 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:51 వరకు

# ఖమేనీ కథం

## కుటుంబంతో సహా హతం

### 40 రోజులు సంతాప దినాలు: ఇరాన్





ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఆయన మృతిచెందినట్లు ఇరాన్ ప్రకటించింది. దాడుల్లో ఖమేనీ కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారు. 40 రోజులు సంతాపదినాలుగా ఇరాన్ ప్రకటించింది. ఖమేనీ నివాసంపై ఆధునిక క్షిపణులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఖమేనీ నివాసమే లక్ష్యంగా 30 క్షిపణులను ఇజ్రాయెల్ ప్రయోగించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్ ఆర్‌జీసీ కమాండర్ మొహమ్మద్ కూడా మృతిచెందారు.

టెహ్రాన్: ఖమేనీ, అధ్యక్షుడు పెజెష్కియానే లక్ష్యంగా ఇజ్రాయెల్ శనివారం ఉదయాన్నే వారి నివాసాలు, కార్యాలయ సముదాయాలపై పెద్దపెట్టున క్షిపణి దాడులకు దిగింది. ఆ వెంటనే మొత్తం టెహ్రాన్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. అనంతరం అమెరికా సైన్యం కూడా రంగంలోకి దిగింది.

-2 వ పేజీలో...



# అమెరికా అంతు చూస్తాం

### ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం.. ఇరాన్ అధ్యక్షుడి ప్రకటన

ఖమేనీ హత్యను ముస్లింలు, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియా వర్గీయులపై ప్రకటించిన బహిరంగ యుద్ధంగా పెజెష్కియాన్ అభివర్ణించారు. తమ అత్యున్నత నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం ఇస్లామిక్ రిపబ్లిక్ చట్టబద్ధమైన హక్కు, బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

2



# 18 మంది పేలిపోయారు!

## నాగ్‌పూర్‌లో ఘోర ప్రమాదం

### పేలుడు తయారీ పరిశ్రమలో ఘటన.. 20 మందికి తీవ్ర గాయాలు

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. కటోల్ ప్రాంతంలోని ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ అనే పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ భవనం పూర్తిగా దెబ్బతినడంతో శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగ్‌పూర్: పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఎస్‌బీఎల్ ఎనర్జీ యూనిట్‌లో తెల్లవారు జామున కార్మికులు తమ విధుల్లో నిమగ్నమై ఉండగా ఈ పేలుడు సంభవించింది. ఆ సమయంలో ఫ్యాక్టరీలోని వివిధ విభాగాల్లో సుమారు 30 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో సమీప గ్రామాల ప్రజలు భూకంపం వచ్చిందేమోనని భయాందోళనలకు గురయ్యారు. ఫ్యాక్టరీ నుంచి దట్టమైన పొగ, మంటలు ఎగసిపడటంతో స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని అధికారులకు సమాచారం అందించారు. దీంతో జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, స్థానిక పోలీసులు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తరువాయి 2 వ పేజీలో...

# 100 డాలర్లకు బ్యారెల్ చమురు!?




### హోర్ముజ్ జలసంధి మూసివేత ఎఫెక్ట్

### బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 8 నెలల గరిష్టానికి

### సోమవారం నాటికి 20 డాలర్లు పెరిగే ఛాన్స్

### చమురు నిల్వలపై భారత్ అత్యవసర ప్రణాళిక

న్యూఢిల్లీ: గత శుక్రవారమే అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధర ఏడు నెలల గరిష్ట స్థాయి 72.87 డాలర్ల వద్ద ముగిసింది. అయితే, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల పరిణామాలు, హోర్ముజ్ జలసంధి మూసివేత వార్తలతో సోమవారం మార్కెట్లు తిరిగి ప్రారంభమయ్యే సరికి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చమురు ధరలు ఒక్కసారిగా బ్యారెల్‌కు 80 డాలర్ల నుంచి 100 డాలర్ల వరకు చేరవచ్చని బ్లూమ్‌బెర్గ్, రైస్టాడ్ ఎనర్జీ వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయి. భారతదేశం -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,871 |
| వెండి (గ్రాము): | రూ.320 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,913 |



# డీఎంకే ఇంటికే!

### ఆ పార్టీకి మళ్లీ అధికారం పీడకలే.. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేదే గెలుపు.. మదురైలో మోదీ

తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు.

మదురై: మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 'తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు. కానీ ఎన్‌డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు టర్నింగ్ పాయింట్. డీఎంకేను ఇంటికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమని ప్రజలు తరువాయి 2 వ పేజీలో...




7


# శాంసన్ డే!

### సంజూ సూపర్ ఇన్నింగ్స్

### సెమీస్‌కు దూసుకెళ్లిన భారత్

### వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు

## విశ్వవాణి



రాబోయే కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు పెళ్లి కాకుండానే ఉండిపోతారని ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వే సంచలన ప్రకటన చేసింది. జీవితాంతం ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడతారని తెలిపింది. బంధాల్లో అహం, వ్యక్తిగత లక్ష్యాలు, కెరీర్, ఒంటరి జీవితాన్ని ఆస్వాదించడం లాంటి కారణాలతో చాలా మందికి పెళ్లికి వెనుకాడుతారని పేర్కొంది.



# మా రిసెప్షన్‌కు రండి!

### రేవంత్ దంపతులకు రష్మిక ఆహ్వానం.. కొత్త పెళ్లికూతురికి రేవంత్ సతీమణి స్పెషల్ గిఫ్ట్

# కరెంటు మస్తు వాడేస్తున్నరు!

### ఆదివారం గరిష్ఠ విద్యుత్తు వినియోగం.. 6267 మెగావాట్లకు డిమాండ్

### టీజీఎన్పీడీసీఎల్ మరో రికార్డు.. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): ఆదివారం తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) చరిత్రలోనే అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6267 మెగావాట్లు నమోదైనట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. శనివారం నమోదైన 6057 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను అధిగమిస్తూ, నేడు 6267 మెగావాట్లకు చేరుకోవడం ఎన్పీడీసీఎల్ చరిత్రలో మైలురాయిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇది సంస్థ ముందస్తుగా తీసుకున్న ప్రణాళికాబద్ధమైన చర్యల ఫలితమని స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని తరువాయి 2 వ పేజీలో...



# తెలుగోళ్లూ జాగ్రత్త: రేవంత్

హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య భీకర దాడులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఆ ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

2.3.2026

మేషం: ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమిస్తారు. దీర్ఘ కాలిక అనారోగ్యాల నుండి ఉపశమనం కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో నిర్ణయాలు మార్చుకుంటారు. వ్యాపార ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

వృషభం: మిత్రులతో విహారయాత్రలలో పాల్గొంటారు. ఇంటా బయట అనుకూల పరిస్థితులు ఉంటాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. సన్నిహితులతో కుటుంబమున ఉత్సహంగా గడుపుతారు. చేపట్టిన పనులలో కార్యజయం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

మిధునం: బంధు మిత్రులతో మనస్పర్ధలు కలుగుతాయి. ఋణ సమస్యలు అధికమై మానసిక ఇబ్బందులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఋణయత్నాలు చేస్తారు. ప్రయాణాలు ఇబ్బందులు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. పాత మిత్రుల కలయిక ఆనందాన్ని ఇస్తుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పురోగతి కనిపిస్తుంది.

సింహం: చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం లభిస్తుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. వృత్తి, వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు. ఉద్యోగమున కొన్ని వ్యవహారాలలో చిక్కులు అధిగమిస్తారు.

కన్య: కొన్ని పనులలో సమస్యలు తొలగి ఊరట కలుగుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. ఆప్తుల వలన కొన్ని విషయాలు తెలుసుకుంటారు. ఆధ్యాత్మిక, సేవ కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి.

తుల: ధన, వస్తు,వాహన లాభాలు ఉన్నవి. కొన్ని వివాదాల నుండి తెలివితేటలతో బయట పడగలుగుతారు. సంఘంలో పెద్దల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. వ్యాపారాలలో ఆశించిన ఫలితాలను పొందుతారు. వృత్తి ఉద్యోగాలలో ఉన్నత అవకాశాలు లభిస్తాయి.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాల్లో అవాంతరాలు ఏర్పడతాయి. వృత్తి,ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాల వలన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహంగా ఉంటాయి.

ధనస్సు: దూరప్రయాణంలో వాహన ఇబ్బందులు ఉంటాయి. ఇంటాబయటా ప్రతికూల వాతావరణం ఉంటుంది. ఋణ ప్రయత్నాలు అనుకూలించవు. వృత్తి, ఉద్యోగాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. ఆరోగ్య విషయమై వైద్య సహాయం అవసరం అవుతుంది.

మకరం: వ్యాపార వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి లాభం కలుగుతుంది. దైవారాధన వలన శుభ ఫలితాలు కలుగుతాయి. వృత్తి,వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: ముఖ్యమైన పనులలో కావాల్సిన వారి సహాయ సహకారాలు లభిస్తాయి. ఆత్మీయులు నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపార,ఉద్యోగాలలో మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. సంతాన విద్యా విషయాలు సంతృప్తి కలిగిస్తాయి.

మీనం: ఆరోగ్యం మందగిస్తుంది. వ్యాపార,ఉద్యోగాలు నిరుత్సాహం కలిగిస్తాయి. ఆకస్మిక ధన వ్యయ సూచనలు ఉన్నవి. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరత్వం ఉండవు. పనులు మందకొడిగా సాగుతాయి.

# అమెరికా అంతు చూస్తాం

## ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం.. ఇరాన్ అధ్యక్షుడి ప్రకటన

టెహ్రాన్: ఖమేనీ హత్యపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమేనీ హత్యను ముస్లింలు, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియా వర్గీయులపై ప్రకటించిన బహిరంగ యుద్ధంగా పెజెష్కియాన్ అభివర్ణించారు. తమ అత్యున్నత నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం ఇస్లామిక్ రిపబ్లిక్ చట్టబద్ధమైన హక్కు, బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ చారిత్రక నేరానికి పాల్పడిన సూత్రధారులు, పాత్రధారులకు కచ్చితంగా తగిన శాస్తి జరిగి తీరుతుందని ఘాటుగా హెచ్చరించారు. ఖమేనీ పవిత్ర రక్తం అమెరికన్-జియోనిస్ట్ అణచివేతను సమూలంగా నాశనం చేస్తుందని ఉద్ఘాటించారు. దేశంలో 40 రోజుల పాటు జాతీయ సంతాప దినాలు పాటిస్తున్నట్లు పెజెష్కియాన్ వెల్లడించారు. ఈ ప్రతీకార ప్రకటనలతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం మరింత భయంకరంగా మారుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఖమేనీ ఆకస్మిక మరణంతో ఇరాన్‌లో నాయకత్వ శూన్యత ఏర్పడకుండా అక్కడి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఒక తాత్కాలిక కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్, న్యాయవ్యవస్థ అధిపతి తదితరులు ఉన్నారు. మరోవైపు ఖమేనీ మృతికి నిరసనగా ఇరాన్‌తో పాటు ఇరాక్, పాకిస్థాన్ లాంటి పొరుగు దేశాల్లోనూ భారీ ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలే లక్ష్యంగా నిరసనకారులు ప్రదర్శనలు చేపడుతున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సైతం రంగంలోకి దిగి తమ చరిత్రలోనే కనీవినీ ఎరుగని స్థాయిలో తీవ్రమైన దాడులు చేస్తామని ప్రకటించింది. తమ దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసిన శత్రువులకు తగిన బుద్ధి చెబుతామని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కూడా తీర్మానించింది. ఇరాన్ ప్రతీకార ప్రకటనల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇరాన్ నాయకత్వం ఇంకెలాంటి దాడులకు దిగినా సరే గతంలో ఎన్నడూ చూడని విధ్వంసాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆయన సోషల్ మీడియా వేదికగా వార్నింగ్ ఇచ్చారు. ఖమేనీ మరణంతో ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి తమ చేతుల్లోకి



తీసుకునేందుకు ఒక గొప్ప అవకాశం లభించిందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

### కొత్త లీడర్‌గా అయతొల్లా అలీరెజా అరాఫీ

ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీరెజా అరాఫీ నియామకమయ్యారు. ఈ మేరకు ఇరాన్ నాయకత్వం ఆయన పేరును ఇరాన్ మధ్యంతర సుప్రీం లీడర్‌గా ప్రతిపాదించింది. ఆయన స్థానికంగా సీనియర్ మత గురువుగానే కాకుండా, గతంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇరాన్ నిర్ణయం తీసుకుంది. అయతొల్లా అరాఫీని మధ్యంతర అధినేతగా నియమించింది. ప్రస్తుతం ఇరాన్‌ను అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, చీఫ్ జస్టిస్ ఘోలాంహోస్సేన్ మోసేన్ ఆధ్వర్యంలోని కౌన్సిల్ నడిపిస్తోంది. వీరే అరాఫీని సుప్రీం లీడర్‌గా నియమించారు. అరాఫీ బాధ్యతలు, విధుల్ని ఈ కౌన్సిల్ పర్యవేక్షిస్తుంది. అసెంబ్లీ సమావేశమై, ఖమేనీ వారసుడిని ఎన్నుకునేవరకు అరాఫీ నియామకం చెల్లుతుంది. 1959లో జన్మించిన అయతొల్లా అలీరెజా అరాఫీ ఇరాన్‌లో కీలక నేతగా ఉన్నారు. ఆయన మత గురువుగానే కాకుండా గార్డియన్ కౌన్సిల్, అసెంబ్లీ నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ ఇస్లామిక్ సెమినరీస్‌కు నాయకత్వం వహించారు. విద్యావంతుడు. అరబిక్, ఇంగ్లీష్ మాట్లాడగలడు. సాంకేతిక అంశాలపై కూడా ఆయనకు అవగాహన ఉంది. దీంతో ఆయన అయితేనే ప్రస్తుతం ఇరాన్‌ను నడిపించగలరని నాయకత్వం నమ్మింది. ఇకపై అరాఫీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపడుతారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చేపట్టిన మొదటి మత గురువు కూడా ఆయనే.



# ఖమేనీ కథం

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ అగ్ర నేతలతో పాటు అణు స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, భారీ బాంబులతో విరుచుకుపడింది. కొద్ది గంటల అనంతరం ఇరాన్ తేరుకుని ప్రతి దాడికి దిగింది. తొలుత ఇజ్రాయెల్‌పై రెండు దఫాలుగా క్షిపణులతో విరుచుకుపడింది. అనంతరం పలు గల్ఫ్ దేశాల్లోని పలు అమెరికా స్థావరాలపైనా దాడులకు తెర తీసింది. నెలల పాటు ప్లాన్ చేసిన అమెరికా, ఇజ్రాయెల్.. శాటిలైట్ ద్వారా ఖమేనీ లోకేషన్‌ను గుర్తించాయి. టెహ్రాన్‌లోని తన ఆఫీసులోనే ఖమేనీ ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత  నిన్న శనివారం, (ఫిబవరి 28) ఉదయం 1:15 కు ఇరాన్‌పై మిస్సైల్ దాడులు ప్రారంభించాయి. ఖమేనీ కార్యాలయం సముదాయాలపై ప్రెసిషన్ గైడెడ్ మిస్సైళ్లను ఇజ్రాయెల్ ప్రయోగించగా.. తొమహాక్ మిస్సైళ్లతో అమెరికా ఎటాక్ చేసింది. లోకేషన్ గుర్తించిన 15 నిమిషాల్లో ఎటాక్ ప్రారంభించాయి. టెహాన్‌లోని ఖమేనీ కార్యాలయంపై ఏకకాలంలో దాడులు చేపట్టాయి. ఆపరేషన్ కిల్ ఖమేనీ ఆపరేషన్‌కు సౌదీ, గల్ఫ్ దేశాలు మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. అయతొల్లా అలీ ఖమేనీ 1989లో రుహొల్లా ఖొమేనీ తరువాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. 36 ఏళ్లుగా ఆయన ఇరాన్‌ను పాలించారు. చివరి సంవత్సరాల్లో ఆర్థిక సంక్షోభం, ప్రజా నిరసనలు, హమాస్-హిజ్బుల్లా బలహీనత, అమెరికా-ఇజ్రాయెల్ దాడులు వంటి పరిణామాలు ఆయన పాలనను కుంగదీశాయి.

### 48 మందిని లేపేశాం: ట్రంప్

'ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేశారు. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# 18 మంది పేలిపోయారు!

మొదటి పేజీ తరువాయి

సహాయక చర్యలు చేపట్టారు. ఓవైపు మంటలు ఆర్పుతూనే.. మరోవైపు ఫ్యాక్టరీలో ఉన్న మృతదేహాలు, క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చారు. గాయపడిన 20 మందిని నాగ్‌పూర్‌లోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రులకు పంపించారు. చాలా మంది పరిస్థితి విషమంగా ఉండడంతో.. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎస్‌బీఎల్ ఎనర్జీ పరిశ్రమలో ప్రధానంగా డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పరిశోధనలకు వాడే పేలుడు పదార్థాలను తయారు చేస్తారు. అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో కూడిన యూనిట్‌లో సాంకేతిక లోపం వల్ల లేదా అజాగ్రత్త వల్ల ఈ పేలుడు సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది.

# 100 డాలర్లకు బ్యారెల్ చమురు!?

మొదటి పేజీ తరువాయి

తన చమురు అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. చమురు ధర బ్యారెల్‌కు 10 డాలర్లు పెరిగితే, భారత్ అదనంగా దాదాపు 13-14 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1.15 లక్షల కోట్లు) భారాన్ని భరించాల్సి ఉంటుంది. దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమే కాకుండా రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పరిస్థితిని గమనిస్తున్న భారత ప్రభుత్వం ఇప్పటికే రంగంలోకి దిగింది. అత్యవసర పరిస్థితుల కోసం మన దగ్గర ఉన్న స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ (చమురు నిల్వలు) సుమారు 74 రోజుల పాటు దేశ అవసరాలకు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. అలాగే ఇతర దేశాల చమురు దిగుమతులను వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

# మా రిసెప్షన్‌కు రండి!

### సీఎం రేవంత్ దంపతులకు రష్మిక ఆహ్వానం

### కొత్త పెళ్లికూతురికి రేవంత్ సతీమణి స్పెషల్ గిఫ్ట్



కొత్త పెళ్లికూతురు రష్మిక మందన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు వేసిన రష్మిక, సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లింది. అక్కడ సీఎం కుటుంబ సభ్యులతో ఆమె కాసేపు ఆప్యాయంగా గడిపింది. తమ వివాహ రిసెప్షన్ కు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ విషయాన్ని రష్మిక స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకుంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన అర్ధాంగి గీత, ఆయన కుమార్తె నైమిషలను కలవడం చాలా సంతోషంగా ఉందని రష్మిక తెలిపింది. వారితో గడిపిన సమయం, జరిపిన సంభాషణలు చాలా మధురంగా సాగాయని తెలిపారు. ఈ కలయికలో సీఎం అర్ధాంగి గీత, రష్మికకు ఒక ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఆ గిఫ్ట్ పట్ల మురిసిపోయిన రష్మిక, ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'గీత గారు ఇచ్చిన బహుమతి చాలా అందంగా ఉంది. దీన్ని నేను కచ్చితంగా ఏదైనా అత్యంత ప్రత్యేకమైన సందర్భంలో ధరిస్తాను' అని రష్మిక పేర్కొంది.

# కరెంటు మస్తు వాడేస్తున్నరు!

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. అయినప్పటికీ, ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వెల్లడించారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని సీఎండీ ఉద్ఘాటించారు. వేసవిలో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# తెలుగోళ్లూ జాగ్రత్త: రేవంత్

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల దృష్ట్యా అక్కడి తెలంగాణ వాసులు తప్పనిసరిగా భద్రతా మార్గదర్శకాలను పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, అధికారిక హెచ్చరికలను తుచ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను స్వరాష్ట్రానికి సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నామని సీఎం భరోసా ఇచ్చారు. ప్రాణాపాయం లేకుండా అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పరిస్థితులు చక్కబడే వరకు అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇరాన్, తదితర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైతే విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుని తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా దేశాల్లోని భారత ఎంబసీలు, కాన్సులేట్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# డీఎంకే ఇంటికే!

మొదటి పేజీ తరువాయి

నమ్ముతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమే. 25ఏళ్ల తర్వాత 2021లో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ వారు సరైన సుపరిపాలనను అందించలేదు. మొత్తం రాష్ట్రాన్ని లూటీ చేశారు. వారసత్వ రాజకీయాల గురించి ఆలోచిస్తూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. మదురైను ప్రేమించిన ఎంజీఆర్‌తో ఇక్కడి ప్రజలు అండగా నిలిచారు. అందుకే డీఎంకేకు మదురై అంటే ఇష్టం లేదు. ఇంకా మదురైకు మాఫియా తరహా రాజకీయాలను తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ సరిగ్గా లేదు. జాతీయ శుభ్రత ర్యాకింగ్స్‌లో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లింది. అవినీతి వల్ల మేయర్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. డీఎంకే పేదల కోసం పనిచేయదు ఇతరులను కూడా చేయనివ్వదు. తమిళనాడులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దాదాపు ఆరు లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. ఆ కుటుంబాలకు సొంత ఇల్లు వచ్చి గౌరవంతో ఉంటున్నారు. ఇదే సమయంలో మరో మూడు లక్షల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. డీఎంకే ప్రభుత్వం సర్వేలు చేయకుండా కాలయాపన చేయడమే కారణం. డీఎంకే చిల్లర రాజకీయాల వల్ల పేద కుటుంబాలు ఎందుకు ఇబ్బందులు పడాలి. తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు. రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుకళ్లారా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై దృష్టి పెడతాం. డ్రగ్ మాఫియా, క్రిమినల్స్‌ను జైలులో వేస్తాం. మహిళల అభివృద్ధికి, సాధికారతకు ఎన్‌డీఏ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది. రామేశ్వరానికి ఉన్న పాత పంబాన్ బ్రిడ్జ్‌కు దాదాపు వందేళ్లు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత దానిని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ డీఎంకే, కాంగ్రెస్ కూటమి 2004 నుంచి 2014 వరకు పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేసింది? రైళ్లు చాలా నిధానంగా వెళ్లాల్సి వచ్చేది. ఇంకా ప్రభుత్వ ఫైళ్లు కూడా దానికంటే మెల్లగా కదిలేవి. కానీ మా ప్రభుత్వం ఆధునిక పాంబన్ బ్రిడ్జ్‌కు అనుమతులు ఇచ్చాం. గతేడాది దానిని ప్రారంభించే అదృష్టం నాకు దక్కింది. మా పనితీరులో వేగాన్ని ప్రదర్శించాం. అందుకే ఇప్పుడు రైళ్లు కూడా వేగంగా పరిగెడుతున్నాయి. 2009 నుంచి 2014 మధ్య డీఎంకే, కాంగ్రెస్ పాలనలో తమిళనాడుకు రూ. 880 కోట్లు కేటాయించారు. ఒక్క 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే రూ. 7,600 కోట్లు కేటాయించాం. ఇది దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువ' అని పేర్కొన్నారు.

# చిన్నబోయిన ఎర్ర జెండా!



## నక్సలిజం ఇక చరిత్రేనా?.. ఖాళీ అయిన నాయకత్వం.. ప్రభుత్వ వ్యూహం ఫలించినట్లే?

ఒకప్పుడు భారతదేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద సవాలుగా భావించబడిన నక్సలిజం ఉద్యమం ఇప్పుడు చరిత్రలో కీలక మలుపు వద్ద నిలిచినట్టు తాజా పరిణామాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. అడవుల్లో తుపాకుల మోత మోగిన రోజులు క్రమంగా తగ్గుతూ, లొంగుబాట్ల ప్రకటనలు ఎక్కువవుతున్న పరిస్థితి దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది.

ఇటీవల కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జి లొంగిపోవడం నక్సల్ ఉద్యమానికి స్ఫూర్తికరమైన సంఘటనగా మారింది. అంతకు కొద్ది కాలం ముందు నుండి పలువురు కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో స్థాయి నేతలు, రాష్ట్ర-జిల్లా స్థాయి నాయకత్వం వరుసగా లొంగుబాటు ప్రకటించడం ఈ ఉద్యమం లోతైన సంక్షోభంలో ఉందన్న వాదనలకు బలం చేకూరుస్తోంది.

### నాయకత్వ ఖాళీ.. సిద్ధాంతం అలసట

నక్సలిజం బలంగా ఉన్న రోజుల్లో నిర్ణయాలు తీసుకునే కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో నాయకత్వం ఉద్యమానికి దిశానిర్దేశం చేసేది. ఇప్పుడు అదే అగ్రనాయకత్వం లొంగిపోవడం లేదా నిర్వీర్యమవడం వల్ల ఉద్యమంలో స్పష్టమైన దిశాహీనత నెలకొంది. ఒకవైపు భద్రతా బలగాల ఒత్తిడి, మరోవైపు సిద్ధాంతంపై పెరుగుతున్న సందేహాలు ఈ లొంగుబాట్లకు కారణమవుతున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### మారుతున్న భూగోళం.. తగ్గుతున్న మద్దతు

ఇటీవలి కాలంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు, కమ్యూనికేషన్ వ్యవస్థ, సంక్షేమ పథకాలు విస్తరించాయి. అడవుల్లోకి అభివృద్ధి చేరడం, యువతకు విద్యా--ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడం ఉద్యమానికి ప్రధానమైన మానవ వనరుల్ని దూరం చేస్తున్నాయి. ఒకప్పుడు ఆయుధ పోరాటమే మార్గమని నమ్మిన యువత ఇప్పుడు సాధారణ జీవన మార్గాల వైపు మొగ్గు చూపుతోంది.

### లొంగుబాటు - పరాజయమా? లేక వాస్తవానికి అంగీకారమా?

నాయకుల లొంగుబాట్లను కొందరు ఉద్యమ పరాజయంగా చూస్తే, మరికొందరు కాలానుగుణంగా వాస్తవ పరిస్థితులను అంగీకరించిన చర్యగా భావిస్తున్నారు. అయితే, ఆయుధ మార్గం ఇక సాధ్యసాధ్యాల పరిధిలో లేదన్న భావన నక్సల్స్ శ్రేణుల్లో బలంగా పాతుకుపోయిందన్నది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.

### ప్రభుత్వ వ్యూహం ఫలితమా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు కఠిన భద్రతా చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు లొంగుబాటు పథకాలు, పునరావాస కార్యక్రమాలను అమలు చేయడం కూడా ఈ పరిణామాలకు కారణంగా మారింది. తుపాకీకి ఎదురుగా తుపాకీ మాత్రమే కాదు, అభివృద్ధి--పునరావాసమే అసలైన ప్రత్యామ్నాయమన్న వ్యూహం ఇప్పుడు ఫలితాలు ఇస్తున్నట్టుగా కనిపిస్తోంది.

ముగింపు - అంతమా, కొత్త దశా?

నక్సలిజం పూర్తిగా అంతమైపోయిందని ఇప్పుడే తేల్చడం తొందరపాటు కావచ్చు. కానీ, ఒకప్పుడు ఉన్న ప్రభావం, భయంకరమైన ఉనికి ఇక లేదన్నది నిర్వివాదం. వరుస లొంగుబాట్లు, నాయకత్వ సంక్షోభం, ప్రజా మద్దతు తగ్గుదల.. అన్ని కలిపి చూస్తే ఈ ఉద్యమం తన ముగింపు దశలోకి ప్రవేశించినట్టే. అయితే, నక్సలిజాన్ని పుట్టించిన సామాజిక అసమానతలు, అభివృద్ధి లోపాలు పూర్తిగా తొలగిపోనంత వరకు.. ఆ ప్రశ్నలు మాత్రం మరో రూపంలో తిరిగి రావొచ్చు. ఆయుధాల అధ్యాయం ముగియవచ్చు. కానీ, సమానత్వం కోసం పోరాటం మాత్రం ఇంకా మిగిలే ఉంటుంది.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

# రెండేండ్లు మీ భూములు కాపాడుకోండి


## మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. మూసీ దండి మార్చ్ కార్యక్రమంలో కేటీఆర్



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర నేతలు చెబుతుందని... మరి తెలంగాణలో జరుగుతున్న బుల్డోజర్ రాజ్యాన్ని కాంగ్రెస్ ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న బుల్డోజర్ అరాచకాలను కేవలం సీఎం రేవంత్ రెడ్డి పంపిస్తున్న సంచుల కట్టల కోసం చూడకుండా వదిలేస్తున్నారన్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇండ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమే అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ బాధిత కుటుంబాలతో మూసీ దండి మార్చ్ కార్యక్రమంలో భాగంగా మూడున్నర కిలోమీటర్ల పాదయాత్రలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఒక్క ప్రాజెక్టు గానీ, ఒక్క ఇల్లు గానీ, ఒక్క రోడ్డు గానీ వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని... వారికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు. తిరిగి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా... వినిపించుకోకుండా కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ, బెదిరింపులకు దిగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం ఆరోపించారు. 'ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200 కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని, ఇప్పటికే ఆయనకు ప్యాలెస్ లాంటి ఇల్లు ఉన్నదని, అయినా రేవంత్ రెడ్డికి, రేవంత్ రెడ్డి అన్నదమ్ములకు మాత్రం వందల కోట్ల ఇళ్లు కావాలి కానీ.. పేదలు, మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ ఉండకుండా ఎందుకు ఈ విధ్వంసం' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో వందల మంది ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి... అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా ఇళ్లు కూలగొడుతున్నారన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం తన అనుచరులకు, అన్నదమ్ములకు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని... ఇందుకోసం పేదల ఇళ్లను పణంగా పెడుతున్నారన్నారని సంచలన ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 16 వేల కోట్ల రూపాయలతోనే మూసీ సుందరీకరణ కార్యక్రమాన్ని ఒక్క ఇల్లు కూడా పోకుండా డీపీఆర్‌ని కూడా సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లైఓవర్లను కూడా తమ ప్రణాళికలో ఉంచామని, కానీ ఎక్కడా కూడా ఒక్క ఇల్లుకు ఇబ్బంది కాకుండా చూశామన్నారు. అలాంటి అంశాన్ని పక్కన పెట్టి లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీ కోసం వేలమంది ఇళ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కి తెరలేపారని ఆరోపించారు. ఈరోజు మూసీ బఫర్ జోన్‌కి సంబంధించి రకరకాల మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇదే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చిందని, మరి అలాంటి అధికారుల పైన, ఆనాడు అనుమతులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టాలా? అని కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టు కోసం వేలమంది ఇళ్లను కూల్చడం ఆపేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు, ఇండ్లకు బదులు డబ్బులు ఇస్తామని మోసం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు లొంగకుండా ఐక్యంగా ముందుకు సాగాలని మూసీ సుందరీకరణ ప్రాజెక్టు బాధితులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ఖమేనీ హత్య అన్యాయం: అసదుద్దీన్ ఒవైసీ

**భారతీయుల రక్షణ కోసం కేంద్రం చొరవ చూపాలని డిమాండ్**



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హత్యను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది పూర్తిగా అనైతికమని, చట్టవిరుద్ధమైన చర్య అని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగడాన్ని ఆయన తప్పుబట్టారు. ఖమేనీని తమ నాయకుడిగా భావించే షియా ముస్లింలకు ఆయన తన పార్టీ తరఫున సానుభూతి తెలిపారు. జెనీవాలో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే ఈ దాడులు జరగడం దురదృష్టకరమని ఒవైసీ అన్నారు. "చర్చలు సఫలమైతే అణ్వాయుధాల విషయంలో ఇరాన్ సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉండేది. కానీ, పవిత్ర రంజాన్ మాసం అని కూడా చూడకుండా ట్రంప్, నెతన్యాహు దాడులకు తెగబడ్డారు. నెతన్యాహుకు అసలు మానవత్వమే లేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై జరిగిన దాడుల్లో 200 మందికి పైగా చనిపోయారని, ముఖ్యంగా ఒక బాలికల పాఠశాల ధ్వంసమై 108 మంది విద్యార్థినులు ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందన్నారు. ఇజ్రాయెల్ తీరును పాకిస్థాన్‌తో పోల్చిన అసదుద్దీన్.. ఈ రెండు దేశాలు ఆక్రమణదారులని, తమ పొరుగు దేశాలను ప్రశాంతంగా ఉండనివ్వడం లేదని విమర్శించారు. ఇజ్రాయెల్ ఇరాన్‌పై, పాకిస్థాన్ ఆఫ్ఘనిస్థాన్‌పై చేస్తున్న దాడులే ఇందుకు నిదర్శనమని అన్నారు. నెతన్యాహు పాలనలో పాలస్తీనాలో 70 వేల మంది ఊచకోతకు గురయ్యారని ధ్వజమెత్తారు. ట్రంప్, నెతన్యాహు భావిస్తున్నట్లు ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు జరగదని ఆయన స్పష్టం చేశారు. యుద్ధాన్ని ఆపడానికి భారత్ తన వంతు పాత్ర పోషించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. "గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు పనిచేస్తున్నారు. ఒమన్ పోర్టులో జరిగిన దాడిలో ఇప్పటికే కొందరు భారత కార్మికులు గాయపడినట్లు సమాచారం ఉంది. ఉమ్రా కోసం వెళ్లిన వారు విమానాలు రద్దై, డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఖమేనీ హత్యను ఖండించి, ఈ యుద్ధాన్ని ఆపడానికి కృషి చేయాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. యుద్ధం ఆగకపోతే ఆ ప్రాంతమంతా అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు.

# ఖమేనీ హత్యపై హైదరాబాద్‌లో నిరసనలు

**నల్ల దుస్తులు ధరించి రోడ్డెక్కిన షియా ముస్లింలు**

**అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ భారీ ర్యాలీ**

**ఇరాన్ కాన్సులేట్ వద్ద జెండా అవనతం**



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై హైదరాబాద్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని షియా ముస్లింలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఖమేనీ మరణవార్త ధృవీకరణ కావడంతో పాతబస్తీలోని షియా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పురానీ హవేలీ, నూర్ ఖాన్ బజార్, దారుల్ఫా తదితర ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించి, చేతిలో ఖమేనీ ఫొటోలు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. తంజీమ్-ఎ-జాఫరీ సంస్థ పిలుపు మేరకు పురానీ హవేలీలోని మజార్-ఎ-ఇబ్నే-ఖతూన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు కంటతడి పెడుతూ నినాదాలు చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకే ఖమేనీని పొట్టనబెట్టుకున్నారని, అగ్రరాజ్యాలకు తలొగ్గని నేతగా ఆయన నిలిచారని షియా మత పెద్దలు కొనియాడారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ విషాదానికి దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖమేనీ మృతికి సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద ఆ దేశ జాతీయ జెండాను అవనతం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పాతబస్తీలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం టెహ్రాన్‌లో తన నివాసంలోని కార్యాలయంలో ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

# నేడు రాష్ట్రానికి రాహుల్ గాంధీ

**వికారాబాద్ డీసీసీల సమావేశానికి హాజరు**

హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు రానున్నారు. ఈ నెల 2వ తేదీన రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటించనున్నారు. వికారాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం రాహుల్ గాంధీ సోమవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వికారాబాద్‌కు వెళతారు. అక్కడ జరిగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ప్రసంగించనున్నారు. అంతకంటే ముందు రాహుల్ గాంధీ డీసీసీ నాయకుల కుటుంబ సభ్యులతో మాట్లాడటంతో పాటు, వారితో కలిసి ఫొటోలు దిగనున్నారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి సంబంధించి డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే ప్రత్యర్థి పార్టీల ప్రచారాన్ని ఎదుర్కోవడంపై కూడా సూచనలు చేసే అవకాశం ఉంది. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని, ప్రజలతో మమేకం కావాలని కూడా పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేయనున్నారు. అయితే తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలకు జరగనున్న నేపథ్యంలో... ఆ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి రాహుల్ గాంధీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చర్చించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక, రాహుల్ గాంధీ పర్యటనలో ఇటీవల లొంగిపోయిన మావోయిస్ట్ మాజీ అగ్రనేతలను కలవనున్నారు. మరోవైపు రాహుల్ గాంధీ పర్యటన దృష్ట్యా వికారాబాద్ హరిత హోటల్ పరిసరాల్లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

# డైలాగులేనా.. పనిచేసేదుందా?

## చేతనైతే భూభారతి దోపిడీని అడ్డుకో.. సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): భూ భారతి పథకంపై మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి కాదు అది భూ దోపిడీ అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, అధికారుల జేబులు నింపడానికే కొత్త భూ భారతి పోర్టల్ అని ధ్వజమెత్తారు. స్కామ్ వెనుక ఉన్న పెద్ద తలకాయలను కాపాడేందుకే ఆపరేటర్లను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ధరణిని రద్దు చేసి తెచ్చిన భూ భారతితో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైంది...ఈ కుంభకోణంపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సిట్ విచారణ జరిపించాలి'అని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్‌పై మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. భూ భారతి కాదు భూ దోపిడీ అని తీవ్రగా విమర్శించారు. ఎంతో గొప్పగా చెప్పుకుంటూ తీసుకొచ్చిన భూ భారతి పోర్టల్.. ఇప్పుడు అక్రమార్కులకు అడ్డాగా మారింది అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. ధరణి మీద బురదజల్లి భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు ఆ పోర్టల్‌లో జరుగుతున్న కుంభకోణంపై ఎందుకు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ఈరోజు జనగామ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏ రకంగా భ్రష్టు పట్టించిందో రైతులను ఎలా మోసం చేస్తోందో మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు నిలదీశారు. 'ధరణి పోర్టల్‌లో లోపాలున్నాయంటూ పదే పదే విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తో భూ భారతి తెచ్చామని గొప్పలు చెప్పింది. కానీ ఆ పోర్టల్ ఇప్పుడు ఖజానాకు గండి కొడుతూ దళారులకు భూ హారతి పడుతోంది'అని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పూర్తి డబ్బులు కడుతుంటే, భూ భారతి పోర్టల్ ఎడిటింగ్ ఆప్షన్ వాడుకుని కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి, మిగతా 90 శాతం దళారులు జేబుల్లో వేసుకున్నారు. 37 మండలాల్లో ఈ భూ భారతి కుంభకోణం దర్జాగా నడుస్తుంటే, కనీసం నిఘా వ్యవస్థలకు కూడా తెలియకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యమే'అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఘాటుగా విమర్శించారు. 'విలేకరులు వార్తలు రాస్తే తప్ప ముఖ్యమంత్రికి, రెవెన్యూ మంత్రికి ఈ స్కాం గురించి సోయి లేదు. ఈ భారీ కుంభకోణం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద అధికారులు ఉన్నారు. వాళ్ల పేర్లు బయటకు రాకుండా కవర్ చేయడానికే నామమాత్రంగా ఆపరేటర్లను అరెస్ట్ చేసి కేసులు నీరుగారుస్తున్నారు'అని బీర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు.'ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడానికి కమీషన్ల మీద కమీషన్లు, సిట్ లు వేస్తున్న రేవంత్ రెడ్డి.. ఈ భూ భారతి కుంభకోణంపై, ప్రభుత్వ ఖజానా లూటీపై సిట్ తో విచారణ ఎందుకు జరిపించడం లేదు. దీనిపై వెంటనే సిట్ వేసి దోషులను కఠినంగా శిక్షించాలి. ఖజానాకు రావాల్సిన ప్రతి పైసా రాబట్టాలి. పేలని బాంబులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు.. అందరూ కలిసి నిషేధిత భూముల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. లక్షల ఎకరాలను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో పెట్టడం, వసూళ్లు కాగానే తీసేయడం ఈ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారింది'అని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. 'ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తిగా ఫెయిల్ అయ్యారు. ఇలాగే వదిలేస్తే రేపు హైదరాబాద్‌కు మంచినీళ్ల కటకట వస్తుంది. రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత సామాన్యుడిపై ధరల భారం పెంచడం నిత్యకృత్యంగా మారింది'అని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. 'పేదవాడు ఒక మోటార్ సైకిల్ కొనుక్కుంటే దాని మీద పదివేల రూపాయల లైఫ్ టాక్స్ పెంచారు. ఆర్టీసీ ఛార్జీలను డబుల్ చేశారు. ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి, మంత్రుల ఆస్తులు పెరిగాయే తప్ప ప్రజలకు ఏ న్యాయం జరగలేదు. ధరలు పెంచడం, కమీషన్లు దంచుకోవడం తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకేమీ రాదు'అని మాజీమంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# కవితతో తారకరత్న భార్య అలేఖ్యారెడ్డి భేటీ

**ఢిల్లీ లిక్కర్ కేసులో ఊరట లభించడంపై హర్షం**

హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కోర్టు నుంచి భారీ ఊరట లభించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం పట్ల ఆమె సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే దివంగత నందమూరి తారకరత్న అర్ధాంగి అలేఖ్యారెడ్డి .. కవితను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కవిత కుటుంబ సభ్యులతో కలిసి ఆమె విజయోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలేఖ్యారెడ్డి తన ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో కవితతో దిగిన ఫోటోను షేర్ చేస్తూ ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. "నీ విజయం పట్ల చాలా సంతోషంగా ఉంది. నువ్వు నిరూపించుకున్నావ్.. నిజం వైపు నిలబడ్డావు.. చివరకు సాధించావు" అంటూ అలేఖ్య రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలోనూ అలేఖ్యారెడ్డి కల్వకుంట్ల కవితతో తనకున్న సుదీర్ఘ అనుబంధం గురించి సోషల్ మీడియాలో ప్రస్తావించారు. తమ స్నేహం గత 20 ఏళ్లుగా కొనసాగుతోందని, ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినప్పటికీ తమ బంధం చెక్కుచెదరలేదని తెలిపారు. కవిత అంటే తనకు ఎంతో అభిమానమని, తామిద్దరం ఎప్పుడూ కలిసిమెలిసి ఉంటామని పేర్కొన్నారు.



# జగిత్యాల డీమార్ట్‌లో యువతికి వేధింపులు

## ఉతికి ఆరేసిన కుటుంబ సభ్యులు

జగిత్యాల టౌన్, మార్చి 1 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని డీ మార్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. షాపింగ్‌కు వచ్చిన ఓ యువతిని చేతివేళ్లతో అసభ్యకరంగా చూపిస్తూ వేధించిన వ్యక్తిని గుర్తించిన యువతి తండ్రి, బంధువులు అక్కడికక్కడే పట్టుకుని చితకబాదారు. దీంతో కొంతసేపు డీ మార్ట్ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గుమికూడిన ప్రజలను చెదరగొట్టారు.



# రేపు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు రద్దు

మల్యాల, మార్చి 1 (ఈవార్తలు): రాహుగ్రస్త చంద్ర గ్రహణం సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు శ్రీ స్వామి వారికి నివేదన అనంతరం దేవాలయ ద్వారబంధనం చేయనున్నట్లు వెల్లడించారు. తిరిగి గ్రహణం అనంతరం సాయంత్రం 7:00 గంటలకు పుణ్యాహవచనం, సంప్రోక్షణ, తిరుమంజనం, ఆరాధన ఉంటుందని వివరించారు.



# మెడికల్ కార్మికులతో ఎస్పీఎస్ భేటీ: కుర్రి సైదయ్య

సూర్యాపేట, మార్చి 1 (ఈవార్తలు): కనీస వేతనం రూ. 26 వేలు, ఐహెచ్ఎఫ్ఎంఎస్ విధానం తొలగింపు అంశాలపై సూర్యాపేట లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎస్పీఎస్ ఎంఅండ్‌హెచ్‌డబ్ల్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. రాష్ట్ర కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులకు కలిసి వారి సమస్యలను తెలుసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో స్టేట్ జనరల్ సెక్రటరీ చిన్న బోస్క నరేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు భూషణ్, మెడికల్ కాలేజీకి చెందిన సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# మఠాలు, పీఠాలపై దాడులు సహించం

## వీహెచ్‌పీ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి.. హిందూ సమాజం తిరగబడుతుందని హెచ్చరిక



హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): రాష్ట్రంలోని మఠాలు, పీఠాలపై దాడులు సహించబోమని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి హెచ్చరించారు. భాగ్యనగర్ శివారు ప్రాంతమైన కోకాపేట శారద పీఠం భూములపై ప్రభుత్వ చర్య తీవ్ర నేరమన్నారు. ఆదివారం మధ్యాహ్నం శారద పీఠాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ బృందాలు పరిశీలించాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వాత్మానంద స్వామి గారితో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం దాడికి పాల్పడిన తీరును విశ్వహిందూ పరిషత్ నాయకులకు స్వామీజీ వివరించారు. ఈ సందర్భంగా పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మఠాలు, పీఠాలు, మందిరాలపై దాడులు చేస్తే సహించబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వత్తాసు పలుకుతూ హిందూ మందిరాలపై దాడులకు పాల్పడితే బుద్ధి చెబుతామన్నారు. శారద పీఠంపై రాష్ట్ర ప్రభుత్వం పన్నిన కుట్ర హిందువుల విశ్వాసాలను గాయపరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని లాక్కోవడానికి ప్రయత్నించిన ప్రభుత్వం వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారుల తప్పుడు నివేదికల ఆధారంగా హిందువుల విశ్వాసాల పై దాడికి పాల్పడితే రాజ్యాంగం హర్షించదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు మద్దతుగా హిందూ స్వామీజీలను హింసిస్తే హిందూ సమాజం తిరగబడుతుందని బాలస్వామి హెచ్చరించారు. శారదా పీఠం స్థలాన్ని లాక్కోవాలని జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకొని, పీఠం భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పీఠం భూములపై ఏకపక్ష చర్యలు తీసుకోవడం అనేది హిందూ ధార్మిక భావోద్వేగాలను దెబ్బతీయడమేనని ఆయన విమర్శించారు. శారద పీఠం కేవలం భూమి కాదని ,అది భక్తుల విశ్వాసానికి నిలయం అన్నారు. వేదాధ్యయనానికి కేంద్రంగా, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్న పీఠాలపై పగబట్టి కూల్చివేయడం హిందూ వ్యతిరేక చర్య అని అన్నారు. ధార్మిక సంస్థల భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలన్నారు. స్వామీజీలతో, పీఠాధిపతులతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం హిందూ సమాజం క్షమించదని పేర్కొన్నారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో స్వామీజీల పాత్ర అపారమైనదని, వారిని అవమానించేలా లేదా వారి సంస్థల స్వయం ప్రతిపత్తిని హరించేలా చర్యలు తీసుకుంటే విశ్వహిందూ పరిషత్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం రాజ్యశ్యామల మాతను దర్శించుకుని పీఠం పరిసర ప్రాంతాలను, భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రామారావు, రంగనాథ్, అంకిత్, మహేష్, శంకర్ తోపాటు విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



# అవి డీప్‌ఫేక్ వీడియోలు

**వైసీపీ వాళ్ల పనే!: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

హైదరాబాద్, మార్చి 1 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కొందరు తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి తన రూపాన్ని అనుకరిస్తూ వీడియోలు తయారు చేసి, తనను వ్యక్తిగతంగా అప్రతిష్ట పాలుచేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ఈ మేరకు బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ కంటెంట్ మొత్తం అసత్యమైనది, వక్రీకరించినది. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పన్నిన పథకం ఇది. దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది. వైసీపీకి చెందిన కొందరు ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై చట్ట ప్రకారం ముందుకెళతానని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారం వెనుక ఉన్న కుట్రను తేల్చాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వ్యక్తులను, దుష్ట శక్తులను వదిలే ప్రసక్తే లేదని బీఆర్ నాయుడు హెచ్చరించారు. దోషులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు.



# 3న శ్రీవారి ఆలయం బంద్

**చంద్రగ్రహణ ప్రభావంతో నిర్ణయం: టీటీడీ**

తిరుమల, మార్చి 1 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. మార్చి 3వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున, రెండు రోజుల పాటు స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీని రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకారం, మార్చి 1, 2 తేదీల్లో తిరుపతిలోని కౌంటర్లలో ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేయబోమని స్పష్టం చేసింది. టీటీడీ తెలిపిన వివరాల ప్రకారం, మార్చి 3వ తేదీన మధ్యాహ్నం 3:20 గంటల నుంచి సాయంత్రం 6:47 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. ఆగమశాస్త్ర నియమాల అనుసరించి, గ్రహణ సమయంలో ఆలయాన్ని మూసివేయనున్నారు. ఈ క్రమంలో మార్చి 3న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంటాయి. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తర్వాత రాత్రి 7:30 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరుస్తారు. గ్రహణం కారణంగా మార్చి 3న శ్రీవారికి నిర్వహించే ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం వంటివాటిని టీటీడీ రద్దు చేసింది. వీటితో పాటు వీఐపీ బ్రేక్ దర్శనం, శ్రీవాణి, రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. భక్తులను రాత్రి 8:30 గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు. అయితే, మార్చి 4వ తేదీ దర్శనానికి సంబంధించిన ఎస్ఎస్‌డీ టోకెన్లను యథావిధిగా మార్చి 3న జారీ చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ మార్పులను గమనించి, తమ ప్రయాణాలను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

# ఖమేనీ హత్య హేయం: ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యను తీవ్రంగా ఖండించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీ మరణించడం, అనంతరం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆమె ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది యుద్ధం కాదని, శాంతి అని ఆమె స్పష్టం చేశారు. 'కన్నుకు కన్ను సిద్ధాంతం ప్రపంచాన్ని గుడ్డిది చేస్తుంది' అన్న మహాత్మా గాంధీ మాటలను ప్రియాంక ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశాలకు నాయకత్వం వహిస్తున్నామని చెప్పుకునే వారు, ఒక సార్వభౌమ దేశాధినేతను ఇలా లక్ష్యంగా చేసుకుని హత్య చేయడం, వేలాది మంది అమాయకుల ప్రాణాలు తీయడం అత్యంత హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. దీనికి వారు ఏ కారణం చెప్పినా సమర్థనీయం కాదన్నారు. అనేక దేశాలు ఇప్పుడు ఈ ఘర్షణలోకి లాగబడటం విషాదకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆమె పరోక్ష విమర్శలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు సాగిలపడిన మన ప్రధాని మోదీ, కనీసం ఇప్పుడైనా యుద్ధ ప్రభావిత దేశాల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు ప్రియాంక పేర్కొన్నారు.

# వాత్సాయనుడికి వారసుడు బీఆర్ నాయుడు

**టీటీడీ మాజీ చైర్మన్ భూమన ఆరోపణలు**



తాడేపల్లి, మార్చి 1 (ఈవార్తలు): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి సంబంధించిన కొన్ని వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి.. బీఆర్ నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తాజాగా తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ..'సోషల్ మీడియా కనిపిస్తున్న నిన్నటి దృశ్యాలతో హిందువుల హృదయాలు మండిపోతున్నాయి. 94 సంవత్సరాల టీటీడీ పాలక మండలి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనైతిక చర్యలకు పాల్పడుతున్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించారు. ఘటన తర్వాత మౌనంగా టీటీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సింది. ఈ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలనే కుట్ర మీలో కనిపిస్తోంది. రాసలీలల వీడియోలతో హిందువులంతా నిర్ఘాంతపోయారు.. నివ్వెరపోయారు. వాత్సాయనుడికి వారసుడు ఈ నాయుడు. మా హయాంలో జస్ట్ వాయిస్ బయటికి వస్తేనే పృథ్వీతో రాజీనామా చేయించాం. మా నాయకుడు వైఎస్ జగన్ గురించి బీఆర్ నాయుడు దారుణంగా మాట్లాడాడు. వైఎస్ జగన్ గురించే కాదు.. ఆయన కుటుంబంపై కూడా దారుణంగా మాట్లాడాడు. దీనికి ప్రతిఫలంగా దేవుడే.. బీఆర్ నాయుడికి శిక్ష వేశారు. వీడియోలు, ఫొటోలు బయటికి రావడం భగవంతుడి వేసిన శిక్షే. విజయనగర కాలంలో ప్రధాన అర్చకుడు తప్పు చేస్తే తల నరికేశారు. పాపాల ఊబిలో చిక్కుకున్న బీఆర్ నాయుడిని చంద్రబాబు ఏం చేస్తారు?. చంద్రబాబుకు భక్తి అనేది ఒక నాటకమే. బీఆర్ నాయుడిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. దేవుడితో ఆటలొద్దు.. ఇది భగవంతుడు వేసిన అత్యంత భయానక శిక్ష ఇది. టీటీడీ ఆఫీసులో కూడా ఇలాంటి కార్యక్రమాలే చేస్తున్నారా? అని సోషల్ మీడియా బీఆర్ నాయుడిని అడుగుతోంది. పవనానంద స్వామి, ఓ మహా పురుషా.. దీనిపై స్పందించండి. బీఆర్ నాయుడిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఆయన కామ క్రీడలు సోషల్ మీడియాలో ప్రపంచమంతా తెలిసిపోయింది. అలాంటి వ్యక్తిని టీటీడీకి చైర్మన్‌గా నియమించారు. ఆయన బీఆర్ నాయుడు కాదు.. కామ నాయుడుగా మారాడు. ఆ వీడియోలు ఏఐ అని బీఆర్ నాయుడు చెప్తున్న మాట అబద్ధం. నేను కొందరు ఏఐ నిపుణులతో మాట్లాడాను. ఆ వీడియోలు కరెక్టేనని చెప్పారు. బీఆర్ నాయుడుకి సిగ్గు ఉంటే మౌనంగా రాజీనామా చేసి పక్కకు వెళ్లాలి. అలా చేయకపోగా తన వర్గపు మీడియా ద్వారా ఎదురుదాడి చేయటం సిగ్గుచేటు. డీప్ ఫేక్ వీడియోలు అంటూ తప్పించుకోవాలనుకుంటే కుదరదు. పోలీసులకు కూడా అనైతిక బురదను అంటించే ప్రయత్నం చేస్తున్నారు. లడ్డూ ప్రసాదంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాపం ఊరికే పోదు. బీఆర్ నాయుడు హిందూ ధర్మం అనే ఛానల్ కూడా నడుపుతున్నారు. వీఐపీలకు దేవుడి దర్శనం చేయించి వారితో తమ ఖాతాలో డబ్బులు వేయించుకుంటున్నారన్న అనుమానం కలుగుతోంది' అని వ్యాఖ్యలు చేశారు.



# 2029లో జగనే సీఎం: కొడాలి నాని

గుంటూరు, మార్చి 1 (ఈవార్తలు): 2029లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని మాజీ మంత్రి కొడాలి నాని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వేధింపులకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యుల్ని ఆదివారం కొడాలి నాని, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు. అనంతరం, కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. 'కూటమి బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరు. కూటమి ప్రభుత్వం అంబటి కుటుంబసభ్యుల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. టీడీపీ నేతలు కావాలనే అంబటి రాంబాబును రెచ్చగొట్టారు. అంబటి రాంబాబు క్షమాపణలు చెప్పిన టీడీపీ నేతలు ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు. పోలీసుల సమక్షంలో అంబటి ఇంటిపై దాడి జరిగింది.

# నెల్లూరు జీజీహెచ్‌లో అగ్నిప్రమాదం


**ప్రసూతి, పిల్లల వార్డులో మంటలు**

నెల్లూరు, మార్చి 1 (ఈవార్తలు): నెల్లూరు సర్వజన ఆస్పత్రిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు జీజీహెచ్‌లోని ప్రసూతి, చిన్నపిల్లల వార్డులో ఆదివారం మంటలు చెలరేగాయి. పిల్లల వార్డులో మంటలు చెలరేగటంతో ఆందోళన వ్యక్తమైంది. మంటలు, పొగ విస్తరించటంతో వార్డులోని గర్భిణులు, బాలింతలు భయంతో పరుగులు తీశారు. దట్టమైన పొగ వార్డులలో విస్తరించటంతో ఆస్పత్రిలోని రోగులు, పసి పిల్లలు ఉక్కిరి బిక్కిరయ్యారు. దీంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా నెల్లూరు జీజీహెచ్ ఆస్పత్రికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వార్డులు అంధకారంలో మునిగిపోయాయి. మరోవైపు అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. రోగులను సురక్షితంగా ఆస్పత్రి వెలుపలికి తీసుకువచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఆస్పత్రి ఐసీయూలోని ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను నియంత్రించారు. దీంతో ఆందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. పోలీసులు సైతం ఆస్పత్రిలో అగ్నిప్రమాదం ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు. అయితే చిన్నారులు, గర్భిణులు ఉండే వార్డులో మంటలు చెలరేగటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది.



# అమరావతిలో జ్యుడిషియల్ అకాడమీ!

**సీజేఐని కోరిన ఏపీ సీఎం చంద్రబాబు**



విజయవాడ, మార్చి 1 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. అమరావతిలో నిర్మిస్తున్న 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, దీనికి న్యాయ వ్యవస్థ సహకారం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం విజయవాడలో ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించారు. కేవలం కోర్టు భవనాలే కాకుండా.. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట అనుసంధానిస్తూ (ఇంటిగ్రేట్) బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సంస్థల ఏర్పాటుకు అవసరమైన భూములను కేటాయించేందుకు, ఇతరత్రా పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి భరోసా ఇచ్చారు. సమాజంలో మధ్యవర్తిత్వం ద్వారా సత్వర న్యాయం అందాల్సిన ఆవశ్యకతను సీఎం నొక్కిచెప్పారు. గతంలో గ్రామాల్లో పెద్దమనుషుల సమక్షంలో చాలా సమస్యలు పరిష్కారమయ్యేవని, తన తండ్రి కూడా గ్రామంలో ఇలాంటి పెద్దరికం వహించి ఎన్నో వివాదాలను పరిష్కరించారని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసు పరిష్కారమైతే రూ. 10 వేలు, ఒకవేళ పరిష్కారం కాకపోయినా ఆ ప్రక్రియలో పాల్గొన్నందుకు రూ. 3 వేలు అందిస్తామని ప్రకటించారు. న్యాయం త్వరగా జరిగితేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, అందుకే ఇలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రభుత్వానికి భారం కాదని అభిప్రాయపడ్డారు.

**బ్లూ-గ్రీన్ సిటీగా అమరావతి**

దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమరావతిని బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇవ్వడం చారిత్రక ఘట్టమని కొనియాడారు. ప్రజల అవసరాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక బలం కలగలిసిన నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.





# ఖమేనీ హత్యకు త్రిముఖ వ్యూహం

**చీకటిలో కాకుండా పట్టపగలే మెరుపు దాడి.. ఇరాన్ తేరుకునేలోపే ముగిసిన ఆపరేషన్.. జలంతర్గాముల నుంచి టోమాహాక్ క్షిపణులు**

## గాలిలో అమెరికా స్టెల్త్ ఫైటర్ల గర్జన.. ప్రపంచం తొలిసారి చూసిన 'సూసైడ్ డ్రోన్ల' దాడులు

టెహ్రాన్: ఇరాన్ అత్యున్నత అధికార కేంద్రం 'పాశ్చర్ స్ట్రీట్' లోని సుప్రీం లీడర్ నివాసం అత్యంత పటిష్ఠమైన భద్రతకు మారుపేరు. అణుదాడులను కూడా తట్టుకునేలా నిర్మించిన ఆ కోటను బద్దలుకొట్టడానికి అమెరికా, ఇజ్రాయెల్ అత్యంత సంక్లిష్టమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ని అమలు చేశాయి. ఈ దాడి ఎలా జరిగిందనే అంశం ఇప్పుడు అంతర్జాతీయ రక్షణ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా ఏ దేశమైనా వైమానిక దాడులను శత్రువు అప్రమత్తంగా లేని అర్ధరాత్రి వేళల్లో చేపడుతుంది. కానీ, ఈసారి అమెరికా-ఇజ్రాయెల్ వ్యూహకర్తలు దీనికి భిన్నంగా పగటిపూట దాడులు ప్రారంభించారు. ఇరాన్ అధికారులు కార్యాలయాల్లో సమావేశమై ఉండే సమయాన్ని ఎంచుకుని, వారు ఊహించని విధంగా విరుచుకుపడ్డారు. టెహ్రాన్ నగరాన్ని మూడు వైపుల నుంచి చుట్టుముట్టేలా ఈ ఆపరేషన్ ప్లాన్ చేశారు. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా యుద్ధ నౌకలు, జలంతర్గాముల నుంచి వేలాది కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల 'టోమాహాక్' క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించారు. అమెరికాకు చెందిన ఎఫ్-35 స్టీల్త్ ఫైటర్లు, బి-2 బాంబర్లు రాడార్లకు చిక్కకుండా ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి 'పిన్ పాయింట్' బాంబు దాడులు చేశాయి. సరిహద్దు దేశాల నుంచి హైమార్స్ రాకెట్ సిస్టమ్స్ ద్వారా ఖచ్చితమైన లక్ష్యాలపై దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో అతిపెద్ద హైలైట్.. లో కాస్ట్ అన్ మ్యాన్డ్ కాంబాట్ అటాక్ సిస్టం(లుకాస్) డ్రోన్లు. అమెరికా సైన్యం తొలిసారిగా ఈ కమికేజ్ (సూసైడ్) డ్రోన్లను భారీ స్థాయిలో వాడింది. ఇరాన్ సొంతంగా తయారు చేసుకునే షాహెద్ డ్రోన్ల తరహాలో ఉండే ఈ డ్రోన్లు గుంపులుగా వచ్చి ఇరాన్ రక్షణ వ్యవస్థలైన ఎస్-300 క్షిపణులను ఏమార్చి, ఖమేనీ నివాసాన్ని నేరుగా తాకాయి. శాటిలైట్ చిత్రాల ప్రకారం.. కేవలం నిమిషాల వ్యవధిలోనే ఆ ప్రాంతమంతా శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిన తర్వాతే ఈ దాడులు జరగడం విశేషం.




## పాకిస్థాన్‌కు ఇరాన్ సెగ

**కరాచీలో కాల్పులు, 22 మంది మృతి**

**పీఓకేలోని స్కర్దులో ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి నిప్పు**

కరాచీ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణంతో చెలరేగిన ఆగ్రహ జ్వాలలు పొరుగు దేశమైన పాకిస్థాన్‌కు వ్యాపించాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్‌పై ఆదివారం నిరసనకారులు దాడికి యత్నించగా, భద్రతా సిబ్బంది జరిపిన కాల్పుల్లో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో దేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే, వందలాది మంది ఆందోళనకారులు కరాచీలోని యూఎస్ కాన్సులేట్ భవనం బయటి గోడను ధ్వంసం చేసి లోపలికి చొరబడేందుకు ప్రయత్నించారు. భవనంలోని అద్దాలను పగలగొట్టి, ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఓ గదికి నిప్పుపెట్టారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించినా ఫలితం లేకపోయింది. దీంతో పాకిస్థాన్ పోలీసులు, అమెరికా భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 22 మంది మరణించగా, మరో 8 మంది గాయపడినట్లు స్థానిక ఆసుపత్రి వర్గాలు, పోలీసులు ధృవీకరించారు. మరోవైపు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని స్కర్దు పట్టణంలోనూ తీవ్ర నిరసనలు చోటుచేసుకున్నాయి. అక్కడ ఆందోళనకారులు ఐక్యరాజ్యసమితి (యూఎన్) కార్యాలయానికి నిప్పుపెట్టారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడుల నేపథ్యంలోనే ఖమేనీ మరణం సంభవించిందని, దాని పర్యవసానంగానే మద్దతుదారుల ఆగ్రహం పాకిస్థాన్‌కు పాకిందని తెలుస్తోంది. స్థానిక పోలీసుల వివరాల ఆధారంగా రాయిటర్స్ వార్తా సంస్థ ఈ ఘటనలను నిర్ధారించింది.

## యూఏఈపై ఇరాన్ దాడి

దుబాయ్: ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు, డ్రోన్లతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై భీకర దాడి జరిగింది. యూఏఈపై ఇరాన్ మొత్తం 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో దాడి చేసిందని, వాటిలో చాలా వరకు విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 132 క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేయగా, 195 డ్రోన్లను కూల్చివేసినట్టు తెలిపింది. మిగిలినవి సముద్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. ఈ దాడుల శిథిలాలు అబుదాబి, దుబాయ్‌లలో పడటంతో నష్టం వాటిల్లింది. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను అడ్డుకునే క్రమంలో దాని శకలాలు కిందపడి ఆసియా దేశానికి చెందిన ఒకరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. దుబాయ్‌లోని పామ్ జుమేరా ప్రాంతంలో ఓ భవనంపై క్షిపణి శిథిలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు.



# లింకన్ నౌకపై దాడి చేశాం


**ఖమేనీ మరణానికి ప్రతీకారంగానే దాడి.. 4 బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించాం: ఐఆర్‌జీసీ**



టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా యుద్ధ విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై భారీ దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సంచలన ప్రకటన చేసింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. నాలుగు బాలిస్టిక్ మిస్సైళ్లతో అమెరికా యుద్ధ నౌకను లక్ష్యంగా చేసుకున్నామని, నౌక దెబ్బతిన్నదని ఐఆర్‌జీసీ పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ స్థానిక మీడియా ఒక ప్రకటనను వెలువరించింది. "భయంకర దురాగతాలకు పాల్పడేవారికి (టెర్రరిస్ట్ అగ్రెసర్స్) భూమి, సముద్రం శ్మశానంగా మారతాయి" అని ఇరాన్ మిలిటరీ వర్గాలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాయి. ఖమేనీ మరణంపై ఇరాన్ ప్రజల్లో, మిలిటరీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### అంతా వట్టిదే: అమెరికా సెంట్రల్ కమాండ్

'యూఎస్ఎస్ అబ్రహాం లింకన్'పై దాడి చేశామంటూ ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా సైన్యం తీవ్రంగా ఖండించింది. ఇరాన్ ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) చేసిన ఈ ప్రకటనలో ఏమాత్రం వాస్తవం లేదని, అది పచ్చి అబద్ధమని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. తమ అగ్రనేత మరణానికి ప్రతీకారంగా అమెరికా యుద్ధ నౌకపై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని ఇరాన్ ప్రచారం చేసుకుంది. అయితే, దీనిపై స్పందించిన అమెరికా సైన్యం ఓ ఫ్యాక్ట్ చెక్ విడుదల చేసింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు అబ్రహాం లింకన్ నౌక దరిదాపుల్లోకి కూడా రాలేదని, నౌకకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని తేల్చి చెప్పింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తోందని అమెరికా మండిపడింది. తమ నౌక పూర్తిగా సురక్షితంగా ఉందని, ఎప్పటిలాగే కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును ఎదుర్కోవడానికి, అమెరికా పౌరులను రక్షించడానికి తాము చేపట్టిన ఆపరేషన్లలో భాగంగా.. అబ్రహాం లింకన్ నుంచి యుద్ధ విమానాలు యథావిధిగా నింగిలోకి ఎగురుతున్నాయని స్పష్టం చేసింది. ఇరాన్ దాడులను, బెదిరింపులను తిప్పికొట్టేందుకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని పేర్కొంది.



### ఖమేనీ ఖతం..

## ప్రజల సంబురాలు

పలు నగరాల్లో వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్న ప్రజలు

టెహ్రాన్: నాలుగున్నర దశాబ్దాల ఇరాన్ షియా పాలనలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశాన్ని 36 ఏళ్లుగా ఉక్కుపిడికిలితో ఏలిన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (86) శకం ముగిసింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మెరుపుదాడిలో ఆయన హతమయ్యారు. ఈ వార్త పశ్చిమాసియాలో కార్చిచ్చులా వ్యాపించగా, ఇరాన్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ప్రతీకారంతో రగిలిపోతుంటే, మరోవైపు ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ఘటనతో యావత్ పశ్చిమాసియా యుద్ధ మేఘాల నీడలోకి జారుకుంది. ఖమేనీ మరణవార్తను ధ్రువీకరించిన వెంటనే, టెహ్రాన్, ఇస్ఫహాన్, షిరాజ్, కరాజ్ వంటి ప్రధాన నగరాల్లో అసాధారణ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ప్రభుత్వ ఆంక్షలను, ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొందరు భవనాలపైకి ఎక్కి ఆనందంతో కేరింతలు కొట్టగా, మరికొందరు వీధుల్లో నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ తమ స్వేచ్ఛను ప్రకటించుకున్నారు. "నియంతృత్వ పాలన అంతమైంది" అంటూ నినాదాలు చేశారు. స్టార్‌లింక్ వంటి శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ఉపయోగించి కొందరు ఈ సంబరాల వీడియోలను ప్రపంచానికి చేరవేయడంతో అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

### ఇరాన్ యుద్ధంతో

## ఇండియాకు కష్టాలు

**ఇరాన్‌కు వెళ్తున్న భారీ షిప్‌మెంట్లపై అనిశ్చితి**

**నిలిచిన బాస్మతి రైస్ ఎగుమతులు**

న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు భారత ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత నెలకొన్న ఉద్రిక్తతలు ప్రధానంగా రెండు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి: ఒకటి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగేలా చేస్తున్న ముడి చమురు, రెండోది భారత రైతుల ఆదాయానికి మూలమైన బాస్మతి బియ్యం ఎగుమతులు. భారతదేశం నుంచి ఎగుమతయ్యే బాస్మతి బియ్యానికి ఇరాన్ అతిపెద్ద కొనుగోలుదారు. యుద్ధం ప్రారంభం కావడానికి రెండు నెలల ముందే ఇరాన్ వ్యాపారులు భారీగా ఆర్డర్లు ఇచ్చారు. దీంతో భారత మార్కెట్లో బాస్మతి బియ్యం ధర కిలోకు రూ.10 పెరిగింది. అయితే, ఇప్పుడు యుద్ధం కారణంగా ఈ ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. భారత్ ఎగుమతి చేసే మొత్తం బాస్మతి రైస్ లో 25% ఇరాన్‌కు, 20% ఇరాక్‌కు వెళ్తాయి. సుమారు వి2 బిలియన్ల (రూ. 16,000 కోట్లకు పైగా) విలువైన 20 లక్షల టన్నుల బియ్యం వ్యాపారం ఇప్పుడు ప్రమాదంలో పడింది. ప్రస్తుతం సముద్ర మార్గంలో ఉన్న షిప్‌మెంట్ల డెలివరీ తీసుకోవడానికి ఇరాన్ వ్యాపారులు వస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. భారతదేశం తన ముడి చమురు అవసరాల కోసం 40 దేశాలపై ఆధారపడుతున్నప్పటికీ 50% దిగుమతులు పశ్చిమ ఆసియా నుంచే వస్తున్నాయి. ముఖ్యంగా ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి వచ్చే చమురు 'హోర్ముజ్ జలసంధి' గుండానే రావాలి. ప్రపంచ చమురు సరఫరాలోనూ 25% ఈ మార్గం నుంచే జరుగుతుంది. యుద్ధం కారణంగా ఈ జలసంధి మూతపడితే భారత్‌కు రోజుకు వచ్చే 25-27 లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోతుంది. గల్ఫ్ నుంచి అయితే కేవలం 5-7 రోజుల్లో చమురు వస్తుంది. అదే అమెరికా, లాటిన్ అమెరికా నుంచి చమురు తెప్పించుకోవాలంటే 25 నుంచి 45 రోజులు పడుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి దేశంలో ఇంధన ధరలు భగ్గుమనే అవకాశం ఉంది. బియ్యంతో పాటు టీ (తేయాకు) ఎగుమతులపై కూడా ప్రభావం పడనుంది. 2024-25 ఏడాదిలో భారత్ దాదాపు రూ. 700 కోట్ల విలువైన తేయాకును ఇరాన్‌కు ఎగుమతి చేసింది. ప్రస్తుత అనిశ్చితి వల్ల ఈ చెల్లింపులు ఆగిపోయే ప్రమాదం ఉందని ఎగుమతిదారులు ఆందోళన చెందుతున్నారు. మొత్తానికి పశ్చిమ ఆసియాలో యుద్ధం ఎంత త్వరగా ముగిస్తే భారత ఆర్థిక వ్యవస్థకు అంత మేలు జరుగుతుంది.

## ఇది ట్రంప్ సొంత యుద్ధం: కమలా హ్యారిస్

**ట్రంప్ చర్యలు తొందరపాటు, ప్రమాదకరమైనవని అభివర్ణన**

**యుద్ధానికి కాంగ్రెస్ అనుమతి తప్పనిసరి అని స్పష్టీకరణ**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేపట్టిన సైనిక దాడులపై మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికా ప్రజలు కోరుకోని యుద్ధంలోకి ట్రంప్ దేశాన్ని లాగుతున్నారని, ఆయన చర్యలు తొందరపాటుతో కూడుకున్నవని, ఏమాత్రం సమర్థనీయం కావని ఆమె ఆరోపించారు. అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ మరణించిన నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "ఇరాన్‌లో పాలన మార్పు కోసం చేస్తున్న ఈ యుద్ధాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. ట్రంప్ తన ఇష్టానుసారం ఎంచుకున్న ఈ యుద్ధం కోసం మన సైనికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు" అని కమలా హ్యారిస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సైనిక చర్య అమెరికన్ల ప్రాణాలతో ఆడుకునే ప్రమాదకరమైన జూదమని, ఇది ఈ ప్రాంత స్థిరత్వానికి, ప్రపంచంలో అమెరికా ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని ఆమె హెచ్చరించారు. "మనం చూస్తున్నది బలం కాదు, మొండితనం ముసుగులో ఉన్న తొందరపాటు" అని ఆమె విమర్శించారు. ఇరాన్ నుంచి ముప్పు ఉందని తాను అంగీకరిస్తానని, కానీ ఆ ముప్పును ఎదుర్కోవడానికి ఇది సరైన మార్గం కాదని హ్యారిస్ తెలిపారు. యుద్ధాలను ప్రారంభిస్తానని కాకుండా, ముగిస్తానని గతంలో ట్రంప్ హామీ ఇచ్చారని, అది అబద్ధమని తేలిపోయిందన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం యుద్ధంలోకి ప్రవేశించడానికి అధ్యక్షుడికి కాంగ్రెస్ నుంచి అధికారం లభించాలని ఆమె నొక్కిచెప్పారు. ఈ విషయంలో ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ట్రంప్ ఎంచుకున్న ఈ యుద్ధాన్ని మనం ఏకగ్రీవంగా వ్యతిరేకించాలని, ఈ ఘర్షణలో దేశం మరింత ముందుకు వెళ్లకుండా కాంగ్రెస్ తన అధికారాలను ఉపయోగించి నిరోధించాలని ఆమె పిలుపునిచ్చారు.

## అమెరికాకు ప్రాణనష్టం

**ముగ్గురు సైనికుల మృతి**

న్యూయార్క్: ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో తొలిసారిగా అగ్రరాజ్యానికి ప్రాణనష్టం చోటుచేసుకుంది. ఈ ఆపరేషన్‌లో తమ దేశానికి చెందిన ముగ్గురు సర్వీస్ మెంబర్స్ (సైనికులు) మరణించారని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం అక్కడ మేజర్ కంబాట్ ఆపరేషన్స్ (భారీ స్థాయి యుద్ధ చర్యలు) కొనసాగుతున్నాయని, పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందని అధికారులు తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు సమాచారం అందించిన 24 గంటల తర్వాతే వారి వివరాలను వెల్లడిస్తామని సైన్యం స్పష్టం చేసింది. మరికొందరు సైనికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, వారికి చికిత్స అందించి తిరిగి విధుల్లోకి తీసుకుంటామని పేర్కొంది. ఇరాన్ మిలిటరీ, సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఈ ఆపరేషన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## పశ్చిమాసియా పరిస్థితులపై మోదీ ఆరా

**రక్షణ, హోం, విదేశీ, ఆర్థిక మంత్రులతో సమీక్ష**

**గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ**

న్యూఢిల్లీ: రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ అయ్యారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకున్న వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమయ్యారు. ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరిగింది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది.

## ఇండిగో 350 సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ విమానయాన రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణల కారణంగా పశ్చిమ ఆసియా గగనతలాన్ని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా విమాన రాకపోకలు స్తంభించాయి. ఆదివారం నాటికి భద్రతా కారణాల దృష్ట్యా సుమారు 700కు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు విమానయాన వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరికొన్ని విమానాలను సురక్షిత ప్రాంతాల మీదుగా దారి మళ్లించారు. అంతర్జాతీయ విమానయానానికి కీలకమైన పశ్చిమ ఆసియా గగనతలంపై ఆంక్షలు విధించడంతో ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా మధ్య నడిచే విమానాలపై తీవ్ర ప్రభావం పడింది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన గల్ఫ్ హబ్‌లలో విమాన సర్వీసుల షెడ్యూళ్లు తారుమారయ్యాయి. ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలంపై ఆంక్షలు ఉండటంతో విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయ విమానయాన సంస్థలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రముఖ సంస్థ ఇండిగో రానున్న మూడు రోజుల వ్యవధిలో ఏకంగా 350కి పైగా విమానాలను రద్దు చేసింది. మార్చి 1న 166, మార్చి 2న 162, మార్చి 3న 43 విమానాలను రద్దు చేసినట్లు సమాచారం. ఇది ఆ సంస్థ సాధారణ ఆపరేషన్లలో సుమారు 7 నుంచి 8 శాతంగా ఉంది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా భద్రతా సూచనల మేరకు పలు సర్వీసులను రద్దు లేదా దారి మళ్లించాయి.

## మోదీ విదేశాంగ విధానం డొల్ల: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై కాంగ్రెస్ పార్టీ ఆదివారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానం, పనితీరు వల్ల దేశం భారీ మూల్యం చెల్లించుకుంటోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దేశ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని, దీని డొల్లతనం ఇప్పుడు బయటపడిందని ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు. స్వయం ప్రకటిత 'విశ్వగురు' నాయకత్వంలో ఎంత ఆర్భాటం చేసినా వాస్తవం దాగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడులకు కారణమైన వ్యక్తులను, పాకిస్థాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రశంసిస్తున్నారని, ఆఫ్ఘనిస్థాన్‌కు వ్యతిరేకంగా పాక్‌కు అమెరికా మద్దతు ఇస్తోందని ఆయన గుర్తుచేశారు. అలాగే 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌పై టారిఫ్‌లు విధిస్తామని బెదిరించి, 2025 మే 10న ఆపరేషన్‌ను ఆపేశామని ట్రంప్ వందలసార్లు చెప్పుకున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని ఆరోపించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం విషయంలో మోదీ ప్రభుత్వం స్పందించిన తీరు భారతీయ విలువలు, ప్రయోజనాలకు విరుద్ధమని జైరాం రమేశ్ మండిపడ్డారు. 2020 జూన్ 19న చైనాకు మోదీ క్లీన్ చిట్ ఇవ్వడం వల్లే లద్దాఖ్ సరిహద్దు చర్చల్లో భారత్ బలహీనపడిందని, ఇది అమరులైన జవాన్ల త్యాగాలను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా మోదీ విదేశాంగ విధానం దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది.


లావణ్య చిత్రం


అషిక రంగనాథ్



## పిలుపు లేకపోతే రావొద్దు: విరోష్

విజయ్ దేవరకొండ - రశ్మిక మందన్న (విరోష్) వివాహ వేడుకలు అత్యంత ఘనంగా ముగిశాయి. ఇండియాలోనే క్రేజీ వెడ్డింగ్ ఈవెంట్‌గా నిలిచిన ఈ వేడుక దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో జరగనున్న వీరి వెడ్డింగ్ రిసెప్షన్ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఈ వేడుకకు సంబంధించి 'విరోష్' టీమ్ తాజాగా అభిమానుల సంక్షేమం కోసం ఒక విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లోని ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్ లేదా కన్వెన్షన్ సెంటర్ లో ఈ నెల 4వ తేదీ సాయంత్రం జరగనున్న రిసెప్షన్ కి కొన్ని ఆంక్షలు ఉన్నాయని పెళ్లయిన జంట పేర్కొంది. ఈ వేడుకకు కేవలం పరిమిత సంఖ్యలోనే అతిథులను ఆహ్వానించామని తెలిపారు. సుమారు 500 నుండి 800 మంది అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు మాత్రమే ఈ వేడుకలో పాల్గొంటారని ఒక అంచనా. ఆహ్వానితుల సంఖ్యను విరోష్ తక్కువగా ఉండాలని కోరుకున్నారు. అయినా అందరి రక్షణ కోసం భద్రతా పరమైన చర్యలను పోలీసులు కట్టుదిట్టం చేశారు. విజయ్ దేవరకొండ, రశ్మికలకు ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా వేలాదిగా అభిమానులు తరలివచ్చే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో క్రౌడ్ గ్యాథరింగ్ పై పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. హోటల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. కేవలం అధికారిక ఆహ్వాన పత్రిక ఉన్న వారిని మాత్రమే వేదిక లోపలికి అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో విరోష్ టీమ్ కూడా సోషల్ మీడియా వేదికగా అభిమానులకు కీలక సూచనలు చేసింది. మీ భద్రత, క్షేమమే మాకు ముఖ్యం. పోలీసుల నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలో మాత్రమే అతిథులను ఆహ్వానించాం. కాబట్టి ఇన్విటేషన్ లేని వారు ఎవరూ వేదిక వద్దకు వచ్చి ఇబ్బంది పడవద్దు! అని విజ్ఞప్తి చేశారు. అభిమానుల తాకిడి పెరిగితే భద్రత పరంగా సవాలు ఎదురవుతుందని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మీరు ఎక్కడున్నా మీ ఆశీస్సులు అందుతాయని, ఆహ్వానం లేని వారు వచ్చి ఇబ్బందుల పాలు కావొద్దని విజయ్-రశ్మిక జంట కోరుతోంది. భారీ ఎత్తున జనం గుమిగూడటం వల్ల భద్రతా విధులకు ఆటంకం కలగడమే కాకుండా.. అభిమానులు కూడా తోపులాటలో గాయపడే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే -నో ఇన్విటేషన్ - నో ఎంట్రీ- అనే నిబంధనను కఠినంగా అమలు చేయబోతున్నారు.



## అల్లు వారింటికి విరోష్ జంట

విరోష్ పెళ్లయిన వెంటనే మరో గ్రాండ్ సెలబ్రేషన్‌లో భాగం కావడానికి సిద్ధమయ్యారు. మెగా - అల్లు ఫ్యామిలీలో అల్లు శిరీష్ వివాహ వేడుకలు మొదలవడంతో -విరోష్- జంట నేరుగా అల్లు వారి ఇంటికి చేరుకొని సందడి చేశారు. ప్రస్తుతం అల్లు శిరీష్ పెళ్లి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పెళ్లికొడుకుగా ముస్తాబైన శిరీష్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలిసి విజయ్, రష్మిక తమ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అల్లు అర్జున్ కొత్త జంటను చూసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బన్ని అన్నతో విజయ్ కొంత సేపు ముచ్చటిస్తూ కనిపించారు. కొత్త పెళ్లికొడుకు విజయ్, కొత్త పెళ్లికూతురు రష్మిక మందన్న అగ్రనిర్మాత అల్లు అరవింద్ ఆశీర్వాదం అందుకున్నారు. ఈ సందర్భంగా కొత్త జంటను చూసిన అతిథులు, అభిమానులు సోషల్ మీడియాలో వారి ఫోటోలను తెగ వైరల్ చేస్తున్నారు. కొత్తగా పెళ్లయిన ఈ జంటలో కనిపిస్తున్న సంతోషం అల్లు వారి ఇంటి వేడుకల్లో మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## రాజకీయాలకు రోజా బ్రేక్!

స్టార్ హీరోయిన్‌గా తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించిన రోజా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత సినిమాలకు దూరమయ్యారు. మధ్యలో కొంతకాలం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కనిపించినప్పటికీ, పూర్తి స్థాయిలో రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ఇప్పుడు మరోసారి కెమెరా ముందుకు వచ్చి రీ ఎంట్రీ ఇవ్వడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమాలు మానేసినా రోజా ప్రేక్షకులకు దూరం కాలేదు. ప్రముఖ టీవీ షో జబర్దస్త్ ద్వారా ఆమె ఎప్పటికప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చేవారు. ఆ తర్వాత గత ప్రభుత్వంలో మంత్రి బాధ్యతలు స్వీకరించడంతో ఆ షోకు కూడా గుడ్‌బై చెప్పారు. అయితే ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత రోజా మళ్లీ టీవీ కార్యక్రమాల్లో కనిపించడం ప్రారంభించారు. ఇప్పటికే పలు తెలుగు టీవీ షోలలో గెస్ట్‌గా హాజరవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇప్పుడు సినిమాల్లోనూ రీ ఎంట్రీకి సిద్ధమయ్యారు రోజా. తెలుగులో చివరిసారిగా 2013లో, తమిళంలో 2015లో నటించిన ఆమె, దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ తమిళ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆమె నటించిన తమిళ సినిమా అంబే దయానా టీజర్ విడుదలైంది. ఈ చిత్రంలో పారి ఎలవజగన్, రమ్య రంగనాథన్ జంటగా నటిస్తున్నారు. రోజా ఈ సినిమాలో హీరో తల్లి పాత్రలో కనిపించనున్నారు. టీజర్‌లో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మరోసారి తల్లి పాత్రలో ఆమె తన అనుభవంతో అద్భుతంగా నటించినట్టు టీజర్ చూస్తేనే అర్థమవుతోంది. 'అంబే దయానా' చిత్రం సమ్మర్‌లో విడుదల కానుంది. దీంతో రోజా అభిమానులు ఈ సినిమాపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో తమిళంలో 'లెనిన్ పాండ్యన్' అనే మరో సినిమాలో కూడా రోజా కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. అందులో ఆమె వయోవృద్ధ మహిళ పాత్రలో కనిపించనున్నారు. తమిళంలో వరుసగా సినిమాలు చేయబోతున్న రోజా, తెలుగు చిత్రాల్లో ఎప్పుడు రీ ఎంట్రీ ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమాల్లోనూ బిజీ అవుతున్న ఆమె, మళ్లీ పూర్తి స్థాయిలో సినీ రంగంలో చురుకుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి, రాజకీయాల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చిన రోజా 'అంబే దయానా'తో ఎంతవరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటారో చూడాలి.



పశ్చిమాసియాలో ఇరాన్ తో అమెరికా-ఇజ్రాయెల్ కూటమి వార్ ముదురుతున్న తరుణంలో యువ హీరోయిన్ సోనాల్ చౌహాన్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వివాదానికి దారితీసింది. ఒక ప్రైవేట్ ఈవెంట్ కోసం దుబాయ్ వెళ్ళిన సోనాల్ అక్కడ విమాన సర్వీసులు రద్దు కావడంతో తాను చిక్కుకుపోయానని.. తనను కాపాడాలంటూ ప్రధాని మోదీకి, భారత విదేశాంగ శాఖకు (ఎంఇఏ)ను ట్యాగ్ చేస్తూ ప్రాధేయపడింది. అయితే ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు .. దుబాయ్‌లో ఉంటున్న భారతీయులు ఆమెపై విరుచుకుపడుతున్నారు. కేవలం పబ్లిసిటీ కోసం లేదా సోషల్ మీడియా అటెన్షన్ కోసమే ఈ నాసిరకం నటి ఇలా అతిగా ప్రవర్తిస్తోందని సోషల్ మీడియా వేదికగా చీవాట్లు పెడుతున్నారు. దుబాయ్‌లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయులు తాము అక్కడ సురక్షితంగా ఉన్నామని.. జనజీవనం సాధారణంగానే ఉందని చెబుతుంటే.. సోనాల్ మాత్రం తాను ఏదో భారీ ప్రమాదంలో ఉన్నట్లు చిత్రీకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దుబాయ్‌లో 30 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు.. మీరు ఒక సెలబ్రిటీ అయినంత మాత్రాన కేవలం మీ గురించి మాత్రమే ఆలోచించి ఇలాంటి పోస్టులు చేయడం సరికాదు! అంటూ నెటిజన్లు క్లాస్ తీసుకున్నారు.

## సోనాల్ చౌహాన్‌కు చీవాట్లు





## విజయ్‌కు కొడుకు షాక్

తమిళ స్టార్ హీరో విజయ్ వ్యక్తిగత జీవితం ప్రస్తుతం వివాదాల మధ్య సాగుతుందని చెప్పాలి. కుటుంబ సమస్యలు ఒక్కసారిగా బయటకు రావడంతో ఆయన పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా ఆయన భార్య సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించడం సంచలనంగా మారింది. అదే సమయంలో కుమారుడు జేసన్ సంజయ్ తన తండ్రిని ఇన్ స్టాగ్రామ్ లో అన్ ఫాలో చేశాడన్న కొత్త ప్రచారం ఇప్పుడు మరో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా విజయ్ కు వ్యక్తిగతంగా వరుస షాక్ లు తగులుతున్నాయనే అభిప్రాయం నెటిజన్లలో వ్యక్తమవుతోంది. కుటుంబ విభేదాలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జేసన్ సంజయ్ తన తండ్రిని ఇన్ స్టాగ్రామ్ లో అన్ ఫాలో చేశాడన్న వార్త వైరల్ కావడంతో, తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఉన్నాయా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.



## 13న ఓటీటీలోకి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రానికి ఓటీటీ రిలీజ్‌కు లైన్ క్లియర్ అయింది. 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. పండగ సీజన్‌లో భారీ సినిమాల పోటీ కారణంగా ఈ చిత్రం 'బిలో యావరేజ్' టాక్‌తో సరిపెట్టుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలో రిలీజ్ డేట్ విషయంలో చాలా కాలం నుండి సస్పెన్స్ కొనసాగుతూ వస్తుంది. మొదటగా ఈ సినిమా ఫిబ్రవరి 13న ఓటీటీలో విడుదల కావాల్సి ఉండగా, సాంకేతిక కారణాల వల్ల స్ట్రీమింగ్ వాయిదా పడింది. ఆ తరువాత ఫిబ్రవరి 27, మార్చి 6 అంటూ పలు తేదీలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా ఈ చిత్రానికి డిజిటల్ హక్కులు దక్కించుకున్న జీ5 ప్లాట్‌ఫామ్ మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

## కాలేజీ కుర్రాడిలా 'ఉస్తాద్'

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన గ్రేస్ స్టైల్‌తో మరోసారి బాక్సాఫీస్‌పై దండయాత్రకు సిద్ధమయ్యారు. తాజాగా విడుదలైన -ఉస్తాద్ భగత్ సింగ్- సరికొత్త పోస్టర్‌లో పవన్ లుక్ చూసి అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. ఈ ఫోటోలో పవన్ కళ్యాణ్ పాతికేళ్ల నవ యువకుడిలా, ఒక కాలేజీ బుల్లోడిలా మెరిసిపోతున్నారు. గెడ్డం లేకుండా క్లీన్ షేవ్ తో స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో ఉన్న ఈ లుక్.. మళ్లీ తమ్ముడు, బద్రి రోజుల్లోకి తీసుకెళ్లింది. పవన్ ముఖకవళికల్లో ఉన్న ఆ దుడుకుతనం, బాడీ లాంగ్వేజ్ ఒక యువకుడి ఆవేశాన్ని తలపిస్తున్నాయి. ఈ సినిమా కోసం పవన్ తన లుక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది.. అందుకే ఆయన వయసు మళ్ళీ పాతికేళ్ల వెనక్కి వెళ్ళిందా అన్నట్లుగా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ తో సినిమా విడుదలకు కౌంట్‌డౌన్ కూడా మొదలైంది. -పాతిక రోజుల్లోనే బాక్సాఫీస్ పెద్ద పండగ- అంటూ మేకర్స్ ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది.






# శాం 'సన్' డే!

## సంజూ సూపర్ ఇన్నింగ్స్.. సెమీస్‌కు దూసుకెళ్లిన భారత్

### వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు.. 5న ఇంగ్లండ్‌తో సెమీఫైనల్

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈరోజు వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, సంజు శాంసన్ అద్భుత పోరాటంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో భారత్ మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో తలపడనుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు షై హోప్ (32), రోస్టన్ చేజ్ (40) శుభారంభం అందించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్) భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించడంతో విండీస్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం 196 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన సంజు శాంసన్ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. వికెట్లు పడుతున్నా.. ఒకవైపు వికెట్ కాపాడుకుంటూనే, మరోవైపు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ యాదవ్ (18), తిలక్ వర్మ (27), హార్దిక్ పాండ్యా (17)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా సూర్యతో కలిసి 58 పరుగులు, తిలక్‌తో కలిసి 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన శాంసన్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇన్నింగ్స్ 19.2వ ఓవర్‌లో మిడ్-ఆన్ మీదుగా శాంసన్ కొట్టిన భారీ షాట్‌తో భారత్ విజయ తీరాలకు చేరింది. గెలిచిన వెంటనే మైదానంలో మోకాళ్లపై కూలబడి, ఆకాశం వైపు చూస్తూ దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, జట్టును సెమీస్‌కు చేర్చానన్న ఆనందం అతనిలో కనిపించింది. చివర్లో శివమ్ దూబె (8 నాటౌట్) శాంసన్‌కు సహకరించాడు. ఈ విజయంతో గ్రూప్-1 నుంచి భారత్ దర్జాగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది.




## దుబాయ్‌లో చిక్కుకున్న ఇంగ్లండ్ జూనియర్ జట్టు

### కాపాడాలని జానీ బెయిర్ స్టో విజ్ఞప్తి

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ సైనిక దాడులతో పశ్చిమాసియా వణికిపోతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు యుద్ధం పాకడంతో.. దుబాయలోని వారంతా వణికిపోతున్నారు. అక్కడే చిక్కుకున్న పలువురు ప్రాణ భయంతో మమ్మల్ని కాపాడండి అని మొరపెట్టుకుంటున్నారు. యుద్ధ వాతావరణం నెలకొన్న దుబాయ్‌లోనే ఇంగండ్ల జూనియర్ జట్టు కూడా ఉండిపోయింది. దాంతో.. తమను కాపాడాలని మాజీ ఓపెనర్ జానీ బెయిర్‌స్టో ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశాడు. 'ఎమిరేట్స్.. చివరి ఫ్లయిట్ రద్దయ్యాక తదుపరి విమానం ఎప్పుడు? అనే సమాచారం మాకు అందలేదు. విమాన సంస్థను సంప్రదించేందుకు చాలా ప్రయత్నించాం. కానీ, ఉపయోగం లేదు. దయచేసి ఎవరైనా మాకు సాయం చేయండి. దుబాయ్‌లో ఎవరికైనా ఫ్లయిట్ సమాచారం తెలిసి ఉంటే మమ్మల్ని సంప్రదించండి' అని బెయిర్‌స్టో తన పోస్ట్‌లో అభ్యర్థించాడు. మాజీ ఆటగాడు ఆండ్రూ ఫ్లింటాఫ్‌తో కలిసి ఇంగ్లండ్ లయన్స్ కోచ్‌గా అబుధాబీ వచ్చిన బెయిర్‌స్టో తమను సురక్షితంగా తరలించాలని ప్రాధేయపడుతున్నాడు. అతడి పోస్ట్‌పై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుగానీ, యూఏఈ ప్రభుత్వంగానీ ఇంకా స్పందించలేదు.

### పాక్-ఏ, ఇంగ్లండ్-ఏ సిరీస్ రద్దు

అమెరికా-ఇరాన్ యుద్ధ ప్రభావం క్రికెట్ ప్రపంచంపై కూడా పడింది. పాకిస్తాన్ షాహీన్స్‌తో (ఏ జట్టు) జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ లయన్స్ (ఏ జట్టు) రద్దు చేసుకుంది. ఈ సిరీస్ యూఏఈలోని అబుదాబీ వేదికగా జరుగుతుంది. అబుదాబీ నగరం ప్రస్తుతం ఇరాన్ దాడులతో అట్టుడికిపోతుంది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ అమెరికా ఎయిర్‌బేస్‌ల్లో ఒకటైన అబుదాబీని టార్గెట్ చేసింది. శక్తివంతమైన బాలిస్టిక్ మిసైళ్లతో దాడులు చేస్తుంది. అక్కడే ఇంగ్లండ్ లయన్స్ జట్టు మరియు సపోర్ట్ స్టాఫ్ చిక్కుకుపోయారు. భారతకాలం ప్రకారం ఇవాళ (మార్చి 1) ఉదయం 11 గంటలకు ఇంగ్లండ్ లయన్స్-పాకిస్తాన్ షాహీన్స్ మధ్య రెండో వన్డే జరగాల్సి ఉండింది. అయితే భద్రతా కారణాల వల్ల ఈ మ్యాచ్‌తో పాటు మిగతా సిరీస్ మొత్తాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది."జట్టు భద్రత మా ప్రాధాన్యత. పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నాం" ఈసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది.

## ఆస్ట్రేలియా వుమెన్ క్లీన్ స్వీప్

### భారత మహిళల జట్టుకు ఘోర పరాభవం

### భారీ శతకంతో చెలరేగిన అలీసా హీలీ

### కెరీర్‌కు వీడ్కోలు పలికిన అలీసా హీలీ

ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ క్లీన్ స్వీప్ అయ్యింది. హోబర్ట్ వేదికగా ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 185 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో ఆసీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ అలీసా




హీలీ(98 బంతుల్లో 27 ఫోర్లు, 2 సిక్స్‌లతో 158), బెత్ మూనీ(84 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 106 నాటౌట్) సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో శ్రీచరణి(2/106), స్నేహ్ రాణా(2/66) రెండేసి వికెట్లు తీయగా.. రేణుక సింగ్, కాశ్వీ గౌతమ్, దీప్తి శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం భారత్ 45.1 ఓవర్లలో 224 పరుగులకే కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్(29 బంతుల్లో 9 ఫోర్లతో 42), స్నేహ్ రాణా(74 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్లుగా నిలవగా.. ప్రతీకా రావల్(27), స్మృతి మంధాన(0), హర్మన్ ప్రీత్ కౌర్(25), హర్లీన్ డియోల్(14), దీప్తి శర్మ(29), రిచా ఘోష్(18), కాశ్వీ గౌతమ్(0), శ్రీచరణి(11)తీవ్రంగా నిరాశపర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో అలాన కింగ్(4/33) నాలుగు వికెట్లు తీయగా.. జార్జియో వేర్‌హమ్(2/3) రెండు వికెట్లు పడగొట్టింది. నికోల క్యారీ, అన్నాబెల్ సదర్లాండ్, అష్లే గార్డ్‌నర్ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌తో అలీసా హీలీ తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. తన ఆఖరి మ్యాచ్‌లో అద్భుతమైన శతకంతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్‌కు అలీసా హీలీ భర్త, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ హాజరయ్యాడు. ఆమె శతకానికి ఫిదా అయిన అతను తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. అలీసా హీలీకి భారత ఆటగాళ్లు గాడ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. ఇరు వైపు నిలబడి ఆమెకు మైదానంలో స్వాగతం పలికారు. ఈ ఆసీస్ పర్యటనలో మూడు టీ20ల సిరీస్ గెలిచిన భారత జట్టు.. వన్డేల్లో 0-3తో క్లీన్ స్వీప్ అయ్యింది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.

## శ్రీలంక కోచ్ పదవికి జయసూర్య గుడ్‌బై



శ్రీలంక జట్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. హెడ్ కోచ్ సనత్ జయసూర్య గుడ్ బై చెప్పారు. తన పదవికి రాజీనామా చేశారు. పాకిస్తాన్‌తో ప్రపంచ కప్ చివరి మ్యాచ్‌లో ఓటమి, జట్టు టోర్నమెంట్ నుండి నిష్క్రమించిన వెంటనే ఈ విషయాన్ని ప్రకటించారు. వాస్తవానికి ప్రపంచ కప్ తన చివరి అసైన్‌మెంట్ అని ఆయన ముందుగానే నిర్ణయించుకున్నారు గానీ బోర్డుకు అధికారికంగా తెలియజేయలేదు. మ్యాచ్ ముగిసిన వెంటనే సనత్ జయసూర్య మాట్లాడాడు. బాధ్యతలను వేరొకరికి అప్పగించాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. హెడ్ కోచ్ గా ఎక్కువ కాలం ఉండబోనని రెండు నెలల క్రితం ఇంగ్లాండ్ సిరీస్‌లోనే చెప్పానని, అప్పుడే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ప్రపంచ కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసి కోచ్‌గా మంచి ముగింపు ఇవ్వాలనుకున్నానని, అది సాధ్యపడలేదని పేర్కొన్నారు. దానికి బాధపడుతున్నానని వ్యాఖ్యానించారు. మార్చి 13న ఆఫ్ఘనిస్తాన్‌తో శ్రీలంకకు సిరీస్ ఆరంభం కావాల్సి ఉంది. అప్పటివరకు అతను కొనసాగే అవకాశాలు దాదాపుగా లేవు. తాను వెంటనే తప్పుకొంటానని చెప్పారు జయసూర్య. ఆయన కాంట్రాక్ట్ జూన్ వరకు ఉంది. రాజీనామా విషయం శ్రీలంక బోర్డుకు అధికారికంగా తెలియజేయలేదని, ఈ నిర్ణయంపై వారితో చర్చించాల్సి ఉందని చెప్పారు. 2024 టీ20 ప్రపంచ కప్ తర్వాత జయసూర్య శ్రీలంక ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. మొదటి కొన్ని నెలల్లోనే శ్రీలంక పలు విజయాలు సాధించింది. 2024 ఆగస్టులో భారత్ పై వన్డే సిరీస్ గెలిచింది. అదే ఏడాది సెప్టెంబర్‌లో స్వదేశంలో న్యూజిలాండ్‌ను టెస్టుల్లో 2-0తో మట్టికరిపించింది. వన్డే ఐసీసీ ర్యాంకింగ్స్ లల్లో టాప్ 10లో చేరింది. ఛాంపియన్స్ ట్రోఫీకి




## సౌతాఫ్రికాదే ఫస్ట్ ప్లేస

### జింబాబ్వే ఓటమి

ఐసీసీ టీ20 ప్రపంచకప్ టోర్నీని జింబాబ్వే ఓటమితో ముగించింది. అసాధారణ ప్రదర్శనతో ఆసీస్‌ను మట్టికరిపించి సూపర్-8కు అర్హత సాధించిన జింబాబ్వే.. ఈ దశలో ఒక్క విజయాన్ని నమోదు చేయలేకపోయింది. మూడింటికి మూడు మ్యాచ్‌ల్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 5 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ గెలుపుతో గ్రూప్-1 టాపర్‌గా సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 153 పరుగులే చేసింది. కెప్టెన్ సికందర్ రజా(43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ టోర్నీలో నిలకడైన ప్రదర్శన కనబర్చిన బ్రియాన్ బెన్నెట్(15) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. సౌతాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బోష్, క్వెనా మఫకా రెండేసి వికెట్లు తీయగా.. జార్జ్ లింగే, లుంగి ఎంగిడి, అన్రిచ్ నోర్జ్ తలో వికెట్ తీసారు. అనంతరం సౌతాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసి గెలుపొందింది. డెవాల్డ్ బ్రెవిస్(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 42), జార్జ్ లిండే(21 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 30 నాటౌట్), ర్యాన్ రికెల్టన్(22 బంతుల్లో 4 సిక్స్‌లతో 31) టాప్ స్కోరర్లుగా నిలిచారు. జింబాబ్వే బౌలర్లలో సికందర్ రజా(3/29) మూడు వికెట్లు తీయగా.. బ్లెస్సింగ్ ముజర్బాని, బ్రాడ్ ఈవాన్స్ తలో వికెట్ తీసారు. కోల్‌కతా వేదికగా బుధవారం జరిగే తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో సౌతాఫ్రికా అమీతుమీ తేల్చుకోనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 2-3-2026



# భారత్ సమతూకపు దౌత్యం

పశ్చిమాసియాలో దశాబ్దాలుగా ఉన్న సెగ ఇప్పుడు పెను మంటగా మారుతోంది. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచాన్ని ఆందోళనలోకి నెట్టివేస్తున్నాయి. ఫిబ్రవరి 2026 నాటి తాజా దాడుల నేపథ్యంలో, అగ్రరాజ్యం అమెరికా కూడా ఈ వివాదంలో నేరుగా జోక్యం చేసుకోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఈ సంక్షోభ సమయంలో భారతదేశం అనుసరిస్తున్న 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' విధానం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భారత విదేశాంగ శాఖ ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, రెండు దేశాలూ సంయమనం పాటించాలని కోరింది. హింస వల్ల ఏ సమస్య పరిష్కారం కాదని తెలిపింది. వాస్తవానికి, భారతదేశానికి అటు ఇరాన్‌తోనూ, ఇటు ఇజ్రాయెల్‌తోనూ బలమైన చారిత్రక, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. రక్షణ రంగం, అధునాతన సాంకేతికత, వ్యవసాయ రంగాల్లో ఇజ్రాయెల్ భారత్‌కు అత్యంత కీలకమైన భాగస్వామి. ముఖ్యంగా సరిహద్దు భద్రతకు అవసరమైన అత్యాధునిక ఆయుధాల సరఫరాలో ఇజ్రాయెల్ పాత్ర కీలకం. వ్యూహాత్మక చబహార్ ఓడరేవు ద్వారా భారత్ మధ్య ఆసియా దేశాలకు మార్గాన్ని సుగమం చేసుకుంది. అంతేకాకుండా, ఇంధన భద్రత, చారిత్రక సాంస్కృతిక బంధాలు ఇరాన్‌తో ముడిపడి ఉన్నాయి. అయితే, ఈ యుద్ధం కేవలం విదేశీ వ్యవహారం మాత్రమే కాదు, భారతీయుల వంటింటి బడ్జెట్‌పై కూడా ప్రభావం చూపుతుంది. భారత్ తన ఇంధన అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే ఆధారపడి ఉంది. యుద్ధం వల్ల సరఫరా దెబ్బతింటే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటవచ్చు. ఎర్ర సముద్రం మార్గంలో నౌకాయానం ప్రమాదకరంగా మారడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, ఎలక్ట్రానిక్ వస్తువులు, పప్పు దినుసులు, ఇతర నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్, ఇరాన్ పరిసర ప్రాంతాల్లో లక్షల మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. వారి భద్రత ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ పక్షమూ వహించకుండా, జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే అంతర్జాతీయ శాంతిని కాంక్షించడం భారత్ లక్ష్యం. 'ఇది యుద్ధాల యుగం కాదు' అన్న ప్రధాని మోదీ సందేశాన్ని గల్ఫ్ ప్రాంతంలోనూ అమలు చేసేలా భారత్ తన దౌత్య పరపతిని ఉపయోగించాల్సిన అవసరం ఉంది.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం

# రక్త పిపాసి.. ఖమేనీ!

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశంలో 36 ఏళ్ల సుదీర్ఘ ఉక్కుపాదం ముగిసింది. ఫిబ్రవరి 2026 చివరలో అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ అధికారంలో ఉన్న కాలమంతా అసమ్మతిని అణచివేయడమే ప్రాధాన్యంగా సాగింది. డిసెంబర్ 2025లో ఆర్థిక సంక్షోభం కారణంగా మొదలైన నిరసనలపై భద్రతా దళాలు విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి. ఈ హింసలో కనీసం 7,000 మంది పౌరులు చనిపోయినట్లు మానవ హక్కుల సంస్థలు నివేదించాయి. హిజాబ్ నిబంధనల ఉల్లంఘన పేరుతో అరెస్ట్ అయిన మహసా అమిని కస్టడీలో మరణించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ఆ సమయంలో 500 మందికి పైగా చనిపోగా, వేల సంఖ్యలో ప్రజలు జైలు పాలయ్యారు. ఇరాన్ ప్రపంచంలోనే అత్యధికంగా ఉరిశిక్షలు అమలు చేసే దేశాల్లో ఒకటిగా నిలిచింది. 2025లో కనీసం 1,500 మందికి ఉరిశిక్షలు అమలు చేసినట్లు సమాచారం. ఇందులో రాజకీయ ఖైదీలు, మైనారిటీ వర్గాలకు చెందిన వారు అధికంగా ఉన్నారు. ప్రజల్లో భయాన్ని నింపడానికి బహిరంగంగా ఉరితీయడం, కొరడా దెబ్బలు కొట్టడం వంటి మధ్యయుగపు శిక్షలను ఖమేనీ ప్రభుత్వం కొనసాగించింది. మహిళల స్వేచ్ఛపై ఖమేనీ కఠినమైన ఆంక్షలు విధించారు. కఠినమైన డ్రెస్ కోడ్ అమలు కోసం 'మొరాలిటీ పోలీస్' ద్వారా మహిళలను వేధించడం నిత్యకృత్యమైంది. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మహిళలపై తీవ్ర వివక్ష చూపిస్తూ, వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే వ్యవస్థను ఖమేనీ బలోపేతం చేశారు. ఖమేనీ కొన్ని అత్యంత అమానుషమైన శిక్షలు విధించేవాడు. వాటిలో మొహరేబెహ్ (దేవునిపై యుద్ధం) కీలకమైనది. నిరసనకారులపై ఎక్కువగా ఉపయోగించే ఈ నేరం కింద నిందితులకు ఉరిశిక్ష, కుడి చేయి, ఎడమ కాలు కత్తిరించడం, లేదా శాశ్వత బహిష్కరణ వంటి శిక్షలు విధిస్తారు. దొంగతనం లేదా ఇతర నేరాలకు శిక్షగా చేతులు, కాళ్లు కత్తిరించడం వంటి మధ్యయుగపు పద్ధతులను ఖమేనీ ప్రభుత్వం చట్టబద్ధంగా కొనసాగించింది. కంటికి కన్ను సూత్రం ప్రకారం, నేరస్థుల కళ్లలో యాసిడ్ పోయడం లేదా శస్త్రచికిత్స ద్వారా చూపును తొలగించడం వంటి క్రూరమైన శిక్షలు అమలు చేశాడు. వ్యభిచారం వంటి నేరాలకు పాల్పడిన వారికి నడుము వరకు లేదా ఛాతి వరకు భూమిలో పాతిపెట్టి, మరణించే వరకు రాళ్లతో కొట్టే శిక్ష అమలులో ఉంది. జైళ్లలో ఖైదీలకు విద్యుత్ షాక్‌లు ఇవ్వడం, గోళ్లను పీకేయడం, శీతాకాలంలో చల్లటి నీరు పోయడం, గుర్తుతెలియని ఇంజెక్షన్లు ఇవ్వడం వంటి మానసిక, శారీరక హింసకు గురిచేస్తారు. మద్యం సేవించడం లేదా అనైతిక పనులకు పాల్పడ్డారనే నెపంతో బహిరంగంగా వందల సంఖ్యలో కొరడా దెబ్బలు కొట్టడం వంటి అవమానకరమైన శిక్షలు విధించేవాడు. ఖమేనీ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పొరుగు దేశాల్లో ప్రాక్సీ యుద్ధాలను ప్రోత్సహించారు. హమాస్, హిజ్బుల్లా, హౌతీల వంటి సాయుధ గ్రూపులకు ఆర్థిక, సైనిక సహాయం అందిస్తూ పశ్చిమాసియాలో అస్థిరతకు కారణమయ్యారు.



అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ, అణు ఆయుధాల తయారీ దిశగా అడుగులు వేస్తూ ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోకుండా ఉండేందుకు ఇరాన్ ప్రభుత్వం తరచుగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేసేది. జర్నలిస్టులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలపై నిరంతరం నిఘా ఉంచి, వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి జైళ్లలో బంధించారు. ఖమేనీ మరణంతో ఇరాన్‌లో ఒక నియంతృత్వ శకం ముగిసినప్పటికీ, దేశం ఇప్పుడు తీవ్ర రాజకీయ అనిశ్చితిలో ఉంది. ప్రజలు స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తుంటే, మరోవైపు అధికార మార్పిడి కోసం అంతర్గత పోరు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

- సూర్యదేవర వంశీకృష్ణ, విజయవాడ




# మహిళలకు స్ఫూర్తి.. సరోజినీ నాయుడు

సరోజినీ నాయుడు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక ధ్రువతార. ఆమె కేవలం ఒక రాజకీయ నాయకురాలే కాదు, అద్భుతమైన కవయిత్రి కూడా. అందుకే ఆమెను ప్రపంచం 'భారత కోకిల' అని పిలుచుకుంటుంది. సరోజినీ నాయుడు 1879, ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని ఒక విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి డాక్టర్ అఘోరనాథ్ ఛటోపాధ్యాయ నిజాం కళాశాల స్థాపకుడు, తల్లి వరద సుందరీ దేవి కవయిత్రి. చిన్నతనం నుంచే సరోజిని చదువులో ఎంతో ప్రతిభ కనబరిచారు. 12 ఏళ్ల ప్రాయంలోనే మద్రాస్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచారు. అనంతరం ఉన్నత విద్య కోసం ఇంగ్లండ్‌లోని కింగ్స్ కాలేజ్, కేంబ్రిడ్జ్ గిర్టన్ కాలేజీలకు వెళ్లారు. ఇంగ్లండ్‌లో ఉన్నప్పుడే ఆమె కవితలు రాయడం ప్రారంభించారు. ఆంగ్ల భాషలో భారతీయుల ఆత్మను, పల్లె పదాలను, ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబించేలా ఆమె రాసిన కవితలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. ఆమె కవితల్లోని లయాత్మకత, భావుకత వల్ల ఆమెకు 'భారత కోకిల' అనే బిరుదు వచ్చింది. 1905లో బెంగాల్ విభజన సమయంలో ఆమె భారత స్వాతంత్ర్య ఉద్యమంలోకి అడుగుపెట్టారు. గోపాలకృష్ణ గోఖలే, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయుల పరిచయం ఆమెను ప్రభావితం చేసింది. మహాత్మా గాంధీని కలిసిన తర్వాత ఆమె తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేశారు. 1917లో 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్'ను స్థాపించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించాలని గళమెత్తారు. 1925లో కాన్పూర్ వేదికగా జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ గౌరవం దక్కిన తొలి భారతీయ మహిళ ఆమే. 1930లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం (దండి యాత్ర)లో గాంధీజీ పక్కన ఉండి ఉద్యమాన్ని నడిపించారు. ధరాసన సత్యాగ్రహానికి ఆమె నాయకత్వం వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు. భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చాక, ఆమె ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులయ్యారు. తద్వారా భారతదేశంలో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. 1949, మార్చి 2న కార్యాలయంలో పనిచేస్తుండగానే ఆమె గుండెపోటుతో కన్నుమూశారు. సరోజినీ నాయుడు జీవితం ఆధునిక భారత స్త్రీలకు ఒక దిక్సూచి. కుల మతాలకతీతంగా, లింగ వివక్షను ఎదిరించి ఆమె సాధించిన విజయాలు అద్భుతం. ఫిబ్రవరి 13న ఆమె జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం 'జాతీయ మహిళా దినోత్సవం' నిర్వహిస్తోంది.

- విద్యారాణి పూరడి

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.